PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 204 | విజయవాడ, బుధవారం 28 ఫిబ్రవరి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 28 February 2024 | Rs

రాజ్యసభ ఎన్నికల్లో

భారీగా బేరసారాలు

- హిమాచల్, యుపిలో బిజెపి మార్కు అక్రమాలు
- అదనపు సీట్ల కోసం అడ్డదారులు
- క్రాస్ ఓటింగ్‌తో హిమాచల్‌లో కాంగ్రెస్‌కు ఓటమి

5

గగన్‌యాన్ మిషన్‌కు ఎంపికైన వ్యోమగాములు గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లా

గగన్‌యాన్ వ్యోమగాములు వీరే..

- ప్రధాని సమక్షంలో ఇస్రో ప్రకటన

5

ఇంటింటికి వెళ్లండి

- జరిగిన మంచిని వివరించండి
- ఈ 45 రోజులే కీలకం
- కార్యకర్తలకు జగన్ దిశా నిర్దేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'రానున్న 45 రోజులు మనకు చాలా కీలకం. పూర్తి విశ్వాసంతో పనిచేయండి. ప్రతి ఇంటికి వెళ్లండి. వారికి జరిగిన మంచిని వివరించండి. ఇప్పటికే క్షేత్రస్థాయిలో మనం చాలా బలంగా ఉన్నాం. దీనిని కొనసాగించాలి.' అని వైసిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. 'మేము సిద్ధం...మా బూత్ సిద్ధం' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళగిరిలోని సికె కన్వెన్షన్ హాలులో వైసిపి మంగళవారం నిర్వహించింది. ఈ సమావేశంలో ప్రసంగించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ఇచ్చిన చెత్త హామీలు తనకు ఇంకా గుర్తున్నాయని అన్నారు. అలా ఆచరణ సాధ్యంకాని హామీలతో ప్రజల్ని మభ్యపెట్టడం తమ అభిమతం ఎంతమాత్రం కాదని చెప్పారు. 2014లో సాధ్యపడని హామీలను ప్రకటించి వాటిని అమలు చేయకుండా మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుండి తొలగించిన ఘనత చంద్రబాబుదన్నారు. చంద్రబాబుకు విశ్వసనీయత లేదని చెప్పారు. దేశంలోనే విశ్వసనీయతకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మారుపేరుగా నిలిచిందన్నారు. అందుకే ఆచరణ సాధ్యంకాని హామీలను ఇవ్వడం లేదన్నారు. 2019లో అమలు చేయగలిగే హామీలను మాత్రమే ఇచ్చామని, అధికారంలోకి రాగానే 99 శాతం హామీలను నెరవేర్చినట్టు చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 151 నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో విజయం సాధించిందని, ఇపుడు 99శాతం హామీలను అమలు చేయడంతో ప్రజలు తమ వెంటే ఉన్నారని అన్నారు. వైసిపికి ఓటు వేయకపోతే సంక్షేమం ఆగిపోతుందని ప్రజలందరికీ అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. దీనికోసం గ్రామ, వార్డు సచివాలయాలను యూనిట్‌గా తీసుకుని పనిచేయాలని చెప్పారు. బూత్‌స్థాయిలో ఓటర్లను ఎన్నికలలోపు కనీసం ఐదారుసార్లు కలవాలన్నారు. వలంటీర్లు, గృహ సారథులతో సమన్వయపరచుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వ పథకాలతో 87 శాతం పైచిలుకు కుటుంబాలకు సంక్షేమం అందించామని, అదే విషయాన్ని ఓటర్లకు తెలియచేయాలని అన్నారు. లబ్ధి పొందిన ప్రతి గడపకు వెళ్లి చేసిన మంచిని ఓట్లుగా మరల్చుకోవాలని, దానికోసం అంకిత భావంతో పనిచేయాలని సూచించారు.

సున్నా వడ్డీ ఫార్స్

- రీయింబర్స్ స్వల్పం
- రుణాలకు, రిబేటుకు పొంతనే లేదు
- పైగా నెపం రైతుల మీదనే
- సకాలం నిబంధనతో అన్నదాతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టోకరా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అన్నదాతలకు సున్నా వడ్డీ పెద్ద ఫార్స్‌గా తయారైంది. ఏటా రైతులకు బ్యాంకులిస్తున్న రుణాలకు, ప్రభుత్వం తన వంతు రీయింబర్స్ చేస్తున్న వడ్డీ రాయితీకి మధ్య అసలు పొంతన కుదరట్లేదు. ఒక వైపు బ్యాంకులిస్తున్న అప్పులు ఏటికేడు పెరుగుతుండగా, ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ రాయితీ నిధులు అంతకంతకూ తగ్గుతున్నాయి. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్నవారిలో అతికష్టం మీద 10-30 శాతం మందికే సున్నా వడ్డీ అందుతోంది. తతిమ్మా రైతులు మొత్తానికి మొత్తం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. రైతులకు సున్నా వడ్డీ రాకపోవడానికి రైతులదే బాధ్యత అని సర్కారు నెపం మోపుతోంది. సకాలంలో రైతులు బ్యాంకులకు అప్పులు తిరిగి చెల్లించనందున అటు కేంద్రం నుంచి వచ్చే 3 శాతం ఇటు రాష్ట్రం నుంచి అందాల్సిన 4 శాతం వడ్డీ కోల్పోతున్నారని తప్పించుకుంటోంది. గడువు లోపు చెల్లించాలన్న నిబంధన అన్నదాతలను సున్నా వడ్డీకి దూరం చేస్తున్నా ప్రభుత్వం మాత్రం ఆ నిబంధన పట్టుకొని వేలాడుతోంది. రైతుల్లో కొంత మందికి స్వల్ప మొత్తంలో వడ్డీ రాయితీ ఇచ్చి చేతులు దులుపుకుంటోంది.

ఎప్పటికో జమ

ఎన్నికలకు ముందు నవరత్నాల్లో భాగంగా రూ. లక్ష లోపు పంట రుణాలపై రైతులకు వడ్డీ లేని రుణాలంది. పావలా వడ్డీ తీసేసింది. రూ. లక్ష లోపు అప్పులను రైతులు బ్యాంకులకు 'అసలు' కడితే చాలు వడ్డీ వ్యవహారం ప్రభుత్వం చూసుకుంటుందని హామీ ఇచ్చింది. ఆచరణలోకొచ్చేసరికి అసలు, వడ్డీ కలిపి కడితే, వడ్డీని రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేస్తామంది. ఈ నిబంధన రైతులను జీరో ఇంటరెస్టుకు దూరం చేసింది. వైసిపి వచ్చాక ఇప్పటి వరకు మూడు ఖరీఫ్, రెండు రబీ సీజన్లకు సున్నా వడ్డీ క్లెయిములు విడుదల చేసింది. ఎప్పుడో అక్టోబర్, నవంబర్ వడ్డీ రాయితీ ఇవ్వాల్సి ఉండగా బుధవారంనాడు (ఫిబ్రవరి 28) 2022-23 ఖరీఫ్, 2021-22 రబీ వడ్డీ రీయింబర్స్ చేస్తోంది. ప్రభుత్వం విడుదల చేసిన మూడు ఖరీఫ్ సీజన్ల సున్నా వడ్డీ నిధులు ఏటేటా తగ్గగా ఎన్నికల సంవత్సరంలో ప్రస్తుతం స్వల్పంగా పెరిగింది. విడుదల చేసిన రెండు రబీ సీజన్ల వడ్డీ రాయితీ తగ్గుతూ వచ్చింది. ఈ తడవ

మిగతా 5లో

సున్నా వడ్డీ తీరు

ఏడాది	ఖరీఫ్		రబీ	
	లబ్ధిదారులు	అమౌంట్	లబ్ధిదారులు	అమౌంట్
2019-20	14,26,994	289.68	5,61,540	92.39
2020-21	6,70,132	115.33	2,55,568	45.22
2021-22	5,67,843	115.33	4,47,694	84.30
2022-23	6,30,921	131.68	పెండింగ్	పెండింగ్

కేరళలో ఎల్‌డిఎఫ్ అభ్యర్థులు వీరే!

- సిపిఐ(ఎం)15 స్థానాల్లో పోటీ
- సిపిఐ నాలుగు, కేరళ కాంగ్రెస్ (ఎం) ఒక స్థానంలో పోటీ
- విజయ రాఘవన్, ఐజాక్, ఎలమరం కరీం, శైలజ, రాధాకృష్ణన్ వంటి యోధులతో పటిష్టమైన లైనప్‌తో సిపిఐ(ఎం)

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) మంగళవారం ప్రకటించింది. ఎల్‌డిఎఫ్ భాగస్వాముల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కేరళలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలకుగాను సిపిఐ(ఎం)- 15 స్థానాల్లో పోటీ చేస్తోంది. సిపిఐ నాలుగు స్థానాల్లో, కేరళ కాంగ్రెస్ (మణి) ఒక స్థానంలో పోటీ చేస్తున్నాయి. . మంగళవారం నాడు తిరువనంతపురంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ మాస్టర్ తమ పార్టీ పోటీ చేస్తున్న 15 స్థానాల అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. విజయ రాఘవన్, ఐజాక్, ఎలమరం కరీం, శైలజ, రాధాకృష్ణన్ వంటి యోధులతో సిపిఐ(ఎం) పటిష్టమైన లైనప్‌ను కలిగిఉంది. సిపిఎం ప్రస్తుత ఎంపి ఎఎం ఆరిఫ్ (అలప్పుజ), రాజ్యసభ ఎంపి, కేంద్ర కమిటీ సభ్యులు ఎలమరం కరీం (కోజికోడ్), సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్ (పాలక్కడ్), కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కె రాధాకృష్ణన్ (అలత్తూరు), సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఆర్థికశాఖ మాజీ మంత్రి

మిగతా 5లో

మూడేళ్లలో కోటి పని దినాలు మాయం

- మోడీ జమానాలో ఉపాధి హామీ తీరు
- 61 శాతానికి పడిపోయిన వంద రోజుల పని పొందిన కుటుంబాలు

6

రాందేవ్ బాబాపై సుప్రీంకోర్టు మండిపాటు

- పతంజలి తప్పుడు ప్రకటనలపై ఆగ్రహం
- కేంద్రానికీ చివాట్లు

6

ప్లాట్ల రద్దు చెల్లదు

- హైకోర్టు కీలక ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి



ల్యాండ్ పూలింగ్ స్కీంలో భాగంగా రాజధాని అమరావతి రైతులకు కేటాయించిన ప్లాట్లను రద్దు చేసి మరోచోట ఇవ్వడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. సిఆర్‌డిఎ తీసుకున్న ఈ చర్య చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని ఆక్షేపించింది. ప్లాట్ల కేటాయింపుపై చట్టం నిర్దేశించిన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం, సిఆర్‌డిఎ ఉల్లంఘించాయని తేల్చింది. ప్లాట్ల రద్దుకు ముందు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వాలన్న ప్రాథమిక అంశాన్ని ఉల్లంఘించారని, నోటీసులు ఇచ్చి వారి అభ్యంతరాలను స్వీకరించకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని ప్రకటించింది. ఈ చర్య సివిల్ వివాదాలకు ఆస్కారం ఇచ్చేలా ఉందని పేర్కొంది. ప్లాట్ల యజమానులకు నోటీసులిచ్చి వారి అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకున్నాకే రద్దుపై రాతపూర్వక ఆదేశాలు ఇవ్వలేదని తెలిపింది. రాజధాని కోసం భూసేకరణ ప్రక్రియ ద్వారా సేకరించిన భూముల్లో రైతులకు ఇచ్చిన ప్లాట్లను రద్దు చేసి మరోచోట కేటాయిస్తూ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది. తామిచ్చిన ఉత్తర్వులు చట్ట ప్రకారం రైతులకు మరోచోట ప్లాట్ల కేటాయించేందుకు అడ్డంకి కాబోదని రాష్ట్ర ప్రభుత్వానికి, సిఆర్‌డిఎకు చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జి నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం తీర్పు చెప్పింది. రాజధాని అమరావతిలో భూసేకరణ ప్రక్రియ ద్వారా సేకరించిన భూముల్లో రైతులకు ఇచ్చిన ప్లాట్లను రద్దు చేసి మరోచోట కేటాయింపు చర్య ఏకపక్షమని పేర్కొంటూ కొండెపాటి కరుణ ఇతరులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్రం, సిఆర్‌డిఎ సవాల్ చేసిన అప్పీల్‌పై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. వేరే చోట్ల ప్లాట్లు తీసుకునేందుకు సమ్మతించిన రైతులకు చట్ట ప్రకారం చేయాలని, మిగిలిన వారి ప్లాట్లను రద్దు చేయరాదని పేర్కొంది.

డివిజన్ బెంచ్ స్పందిస్తూ.. 'తమ తీర్పు ప్రతి అధికారికంగా అందిన వారం రోజుల్లో ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలి. ఆ నోటీసుల్లో ప్లాట్లను ఎందుకు రద్దు చేయాల్సి వస్తుందో వివరించాలి. ఏ చట్ట నిబంధన కింద ఆ చర్య తీసుకునేదీ స్పష్టం చేయాలి. ప్లాట్ల యజమానుల నుంచి అభ్యంతరాలు స్వీకరణకు 3 వారాల గడువు ఉండాలి. ఆ తర్వాత రైతుల వాదనలకు 2 వారాల గడువు ఉండాలి. ఆపై ప్లాట్లను రద్దు చేస్తూ రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వాలి' అని ఆదేశించింది. సిఆర్‌డిఎ చట్టం ప్రకారం ల్యాండ్ పూలింగ్ స్కీం కింద తీసుకున్న భూముల్లో మాత్రమే రైతులకు ప్లాట్లు కేటాయించాలని ప్రభుత్వం తరపున అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. కొందరికి భూసేకరణ ద్వారా తీసుకున్న భూమిలో కూడా ప్లాటు కేటాయించారని చెప్పారు. అందుకే ప్రభుత్వం రద్దు నిర్ణయం తీసుకుందన్నారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది బి ఆదినారాయణరావు, న్యాయవాదులు సాయి సంజయ్ సూరనేని, కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదిస్తూ.. సిఆర్‌డిఎ చర్య ఏకపక్షమని, చట్ట వ్యతిరేకమని చెప్పారు. ప్లాట్ల యజమానుల వాదనలు వినేందుకు ఆస్కారం లేకుండా ఏకపక్షంగా రద్దు చేయడం చట్ట విరుద్ధమన్నారు.

రూ.100కే కేన్సర్ నిరోధక టాబ్లెట్

- టాటా ఇన్‌స్టిట్యూట్ వెల్లడి

ముంబయి: ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రముఖ క్యాన్సర్ పరిశోధన చికిత్సా సంస్థ రెండవసారి క్యాన్సర్ పునరుద్ధరణను నిరోధించే చికిత్సను కనుగొన్నట్లు ప్రకటించింది. వంద రూపాయలకే ఈ టాబ్లెట్ అందుబాటులో ఉంటుందని పరిశోధన బృందంలో భాగమైన టాటా మెమోరియల్ హాస్పిటల్ సీనియర్ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ రాజేంద్ర బద్వే వెల్లడించారు. ఆయన మంగళవారం నాడిక్కడ ఎన్డీటివితో మాట్లాడుతూ. దీని వెనుక పరిశోధకులు, వైద్యుల పదేళ్ల కృషి దాగి ఉందన్నారు. ఈ టాబ్లెట్ రోగులలో రెండవసారి క్యాన్సర్ రాకుండా నిరోధించగలదని, రేడియేషన్, కీమోథెరపీ వంటి చికిత్స వల్ల వచ్చే దుష్ప్రభావాలను 50 శాతం దాకా ఇది తగ్గించగలదని, రెండవ సారి కేన్సర్‌ను నివారించడంలో 30శాతం ప్రభావవంతంగా ఉంటుందని ఆయన తెలిపారు.. ప్యాంక్రియాస్, ఊపిరి తిత్తులు, నోటి కేన్సర్‌పై కూడా ప్రభావవంతంగా పని చేస్తాయని అన్నారు. పరిశోధన కోసం ఎలుకలపై దీనిని మొదట ప్రయోగించి చూడగా ఫలితాలు బాగా ఉన్నాయని డాక్టర్ రాజేంద్ర బద్వే తెలిపారు.ఆ ప్రయోగ వివరాలను తెలుపుతూ .ఎలుకలోకి మానవ కేన్సర్ కణాలను ప్రవేశపెడతారు.. ఆ కణాలు వాటిలో కణితిని ఏర్పరుస్తాయి అప్పుడు కీమో థెరపి,ఈ రేడియేషన్ థెరపీ వంటివి చేస్తారు. ఈ కేన్సర్ కణాలు చనిపోయినప్పుడు అవి చిన్న ముక్కలుగా విడిపోయి (వీటిని క్రోమాటిక్ కణాలని అంటారు) రక్త నాళాల ద్వారా శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తాయి.. ఆరోగ్యకరమైన కణాలలోకి అవి ప్రవేశించినప్పుడు వాటిని కేన్సర్‌గా మార్చే అవకాశముంది. కొన్ని క్రోమాటిక్ కణాలు ఆరోగ్యకరమైన క్రోమోజోములతో కలిసి కొత్త కణితులకు కారణం కావచ్చని డాక్టర్ రాజేంద్ర బద్వే తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడానికి, వైద్యులు ఎలుకలకు రెస్వెరాట్రాల్ ప్లస్ కాపర్‌కలిగిన ప్రో-ఆక్సిడెంట్ మాత్రలు ఇచ్చారు. అవి ఆక్సిజన్ రాడికల్‌లను ఉత్పత్తి చేసి, క్రోమాటిన్ కణాలను నాశనం చేసిందని అన్నారు. దాదాపు దశాబ్ద కాలంపాటు పరిశోధించి తయారు చేసిన ఈ మాత్రలను సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆమోదం కోసం వేచి చూస్తున్నామని అన్నారు. బహుశా జూన్-జులై నాటికి ఇది మార్కెట్లో అందుబాటులోకి రావచ్చని ఆయన తెలిపారు.

పేదలపై పోలీసుల బీభత్సకాండ

కరకంబాడిలో గుడిసెల కూల్చివేత, లాఠీఛార్జి • సిపిఎం నేతల గృహనిర్బంధం

ప్రజాశక్తి- తిరుపతి, అమరావతి బ్యూరో

పేదలపై తిరుపతి పోలీసులు విరుచుకుపడి బీభత్సం సృష్టించారు. గుడిసెలను జెసిబితో కూల్చి వేశారు. అడ్డుకున్న వారిపై లాఠీఛార్జి చేశారు. దీంతో, పేదల రోదనలు మిన్నంటాయి. పోలీసులు పథకం ప్రకారం. సిపిఎం నేతలను ముందుగా గృహనిర్బంధం చేశారు. జానెడు ఇంటి స్థలం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి విసిగి, వేశారి చివరకు తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడీ ఎర్ర గుట్టపై పేదలు గుడిసెలను సిపిఎం ఆధ్వర్యాన నిర్మించుకొని 33 రోజులుగా అక్కడే ఉంటున్నారు. అక్కడికి జెసిబితో వందలాదిమంది పోలీసులు వచ్చాయి. ఆ గుడిసెల్లోని పేదలను బలవంతంగా బయటకు లాక్కొచ్చారు. అనంతరం జెసిబిలతో వాటిని నేలమట్టం చేశారు. అడ్డుకోబోయిన వారిపై లాఠీఛార్జి చేశారు. ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి సత్యశ్రీ, కమిటీ నాయకులు రాధిక, మునిబాబు, అరుణ్, మస్తాన్లను గుడెసెల్లో నుంచి బయటకు లాక్కొచ్చి పోలీస్ వ్యాన్‌లోకి ఎక్కించారు. వారిని విడిచిపెట్టాలంటూ పేదలు వ్యాన్‌ను అడ్డుకోగా, పోలీసులు వారిపై లాఠీలు ఝులిపించారు. సిపిఎం నాయకులు శివానందంపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఆయన స్పృహ తప్పి పడిపోయారు. పోలీసుల లాఠీఛార్జీలో సిపిఎం సీనియర్ కార్యకర్త వెంకటరమణ ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. అరెస్టు చేసిన వారిని ఏ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళతున్నారో కూడా తెలియనీయకుండా తిరుపతి, రేణిగుంట, ఏర్పేడు, కాళహస్తిల చుట్టూ తిప్పి, ఆ తర్వాత విడిచిపెట్టారు. అంతకు ముందు మంగళవారం తెల్లవారుజాము మూడు గంటల నుంచే సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, రేణిగుంట మండల కార్యదర్శి హరినాథ్, సిఐటియు మండల అధ్యక్షులు నరసింహారెడ్డిలను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. గుడిసెల తొలగింపు అనంతరం వారిని విడిచిపెట్టారు. దీంతో, సిపిఎం

మిగతా 5లో

500కే గ్యాస్ బండ

- 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- మరో రెండు గ్యారెంటీలను ప్రారంభించిన తెలంగాణ సిఎం

గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తున్న రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మరో రెండు గ్యారెంటీల అమలుకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ మహాలక్ష్మి పథకం ద్వారా 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కెసిఆర్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ఆర్థిక నియంత్రణ కొనసాగిస్తూ క్రమశిక్షణతో ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు. మహిళలకు దీపం పథకం ద్వారా రూ.400కే యుపిఎ ప్రభుత్వం గ్యాస్‌బండ ఇస్తే... బిజెపి ప్రభుత్వం దాన్ని రూ.1200కు పెంచినా అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ నోరు విప్పలేదన్నారు. సోనియా గాంధీ ఇచ్చిన మాట శిలాశాసనమన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, 200 యూనిట్ల విద్యుత్ వినియోగదారులందరికీ మార్చిలో జీరో బిల్లు వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసుతో బిఆర్ఎస్ నాయకులు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని అన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డుదారులందరికీ రూ.500కే గ్యాస్‌బండ సరఫరా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో కాల్పులు

- నలుగురు మావోయిస్టులు మృతి

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ పోలీసు అధికారుల కథనం ప్రకారం... డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది చిన్న తుంగలీ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. వారికి మంగళవారం ఉదయం మావోయిస్టులు తారసపడ్డారు. ఈ క్రమంలో ఇరువురి నడుమా కాల్పులు చోటుచేసుకున్నాయి. నలుగురు మావోయిస్టులు చనిపోయారు. ఘటనా స్థలంలో మావోయిస్టుల ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తప్పించుకున్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతుల వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

ప్రబీర్ ఆరోగ్యంపై ఎయిమ్స్ వైద్యులతో పరిశీలన

- సుప్రీం ఆదేశం

6

హైడల్ పవర్ ప్లాంట్‌పై పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

ఇబ్రహీంపట్నంలోని బుడమేరు డైవర్షన్ కాలువపై యాక్టివ్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పొందిన అనుమతులకు విరుద్ధంగా ఆ సంస్థ ఏర్పాటైందంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. పవర్ ప్లాంట్‌ను తీసేసేలా తీర్పు చెప్పాలని మంగళవారం దాఖలు చేసిన పిల్‌లో హైకోర్టును కోరారు. చట్ట వ్యతిరేకంగా మిని హైడల్ పవర్ ప్లాంట్ నిర్మించిందంటూ స్వర్ణాంధ్ర దినపత్రిక పబ్లిషర్, సీనియర్ జర్నలిస్ట్ కెబిజి తిలక్ దాఖలు చేసిన పిల్‌లో ప్రతివాదుల్లో యాక్టివ్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, ఎమ్‌డిని చేర్చారు. వీరి అడ్రస్ హైదరాబాద్ ఆంధ్రజ్యోతి బిల్డింగ్ అని పేర్కొన్నారు. జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక సిఎస్, రెవెన్యూశాఖ ప్రత్యేక సిఎస్, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్, జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌లను కూడా ప్రతివాదులుగా చేర్చారు.

24మంది మునిసిపల్ కమిషనర్ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కమిషనర్లను పెద్ద సంఖ్యలో ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు 24మంది మునిసిపల్ కమిషనర్ల ను బదిలీ చేస్తూ మంగళవారం జీఓ ఆర్‌టి నెంబరు 234ను ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మీ జారీ చేశారు.

హనుమ విహారికి పవన్‌కల్యాణ్ సంఘీభావం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారత క్రికెట్ జట్టుకు 16 టెస్టు మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం, ఆంధ్ర రంజీ జట్టుకు ఏడేళ్ల కెప్టెన్‌గా పనిచేసిన హనుమ విహారికి తాము సంఘీభావం తెలుపుతున్నట్లు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. ఒక వైసిపి కార్పొరేటర్ కారణంగానే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు విహారి తన కెప్టెన్సీకి రాజీనామా చేయాల్సి వచ్చిందని అన్నారు. 'మీకు జరిగిన అన్యాయానికి, రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ మీ పట్ల చూపిన వివక్షకు చింతిస్తున్నాం' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చంద్రబాబుతో పలువురు భేటీ

- టికెట్ రాని వారికి న్యాయం చేస్తానని అధినేత హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో ఉండవల్లిలో పలువురు ఆశావహులు, నేతలు మంగళవారం భేటీ అయ్యారు. చంద్రబాబును కలిసిన వారిలో నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, నంద్యాల పార్లమెంటరీ నాయకులు కెవి సుబ్బారెడ్డి, తాడిపత్రి నాయకులు జెసి పవన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, కడపకు చెందిన రెడ్డప్పగారి శ్రీనివాసులరెడ్డి, తెనాలికి చెందిన మాజీ మంత్రి ఆలపాటి రాజా ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. పార్టీ ప్రకటించిన అభ్యర్థులను గెలిపించుకు రావాలని సూచించారు. సీటు రాలేదంటే పార్టీ వద్దనుకున్నట్లు కాదని నేతలకు స్పష్టం చేశారు. రాయచోటి నియోజకవర్గంలో రామ్ ప్రసాద్‌రెడ్డి విజయానికి సహకరించాలని ప్రసాద్‌కు సూచించారు. సింగనమల టికెట్ బండారు శ్రావణికి ప్రకటించడంతో ఈ నియోజకవర్గంలో కీలక నేతలుగా ఉన్న కేశవరెడ్డి, నర్సానాయుడును పిలిపించి వారితో కూడా మాట్లాడారు. నెల్లిమర్ల సీటు పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నియోజకవర్గానికి చెందిన టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజుతో కూడా మాట్లాడి, జనసేన గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. వీరితోపాటు చంద్రబాబును కర్నూలు పార్లమెంటుకు చెందిన భానుశంకర్, బస్తిపాటి నాగరాజు కలిశారు. సీటు ఇవ్వకపోవడంతో తంబళ్ళపల్లి మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ కూడా చంద్రబాబును కలిసి నియోకవర్గ సమస్యల గురించి చర్చించారు.

బిఇడి కాలేజీల్లో ఇడబ్ల్యూఎస్ కోటా భర్తీకి అనుమతించండి

- పిటిషన్ దాఖలు

ప్రజాశక్తి-అమరావతి

బిఇడి కళాశాలల్లో ఇడబ్ల్యూఎస్ కోటా 10 శాతం సీట్ల భర్తీకి అనుమతివ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, ఉపాధ్యాయ విద్య జాతీయ మండలి ప్రాతీయ డైరెక్టర్లు కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ వి సుజాత మంగళవారం ఆదేశాలిచ్చారు. బిఇడి కాలేజీల్లో ఇడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనుకబడిన తరగతులు) కోటాకు చెందిన 10 శాతం సీట్ల భర్తీకి అనుమతి ఇవ్వలేదంటూ వినుకొండకు చెందిన వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సహా నాలుగు కాలేజీల యాజమాన్యాలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణ మార్చి ఒకటికి వాయిదా పడింది.

తొలిరోజు టెట్ ప్రశాంతం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష-2024 (టెట్) పరీక్షలు మొదటిరోజైన మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం జరిగిన పరీక్షకు 86.37శాతం, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 87.54శాతం మంది విద్యార్థులు హాజరయినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు. మొదటి రోజు పేపర్1(ఎ) పరీక్షకు ఉదయం సెషన్‌లో 17,136 మందికి 14,801 (86.37శాతం), మధ్యాహ్నం సెషన్‌లో 17,253మందికి 15,104 (87.54శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది విద్యార్థులకు ఫేషియల్ అటెండెన్స్ తీసుకోవడంలో సాంకేతిక సమస్యలు ఎదురైనట్లు కమిషనరు తెలిపారు. టెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల పేర్లు, వివరాలు హాల్‌టికెట్‌లో పూర్తిగా తప్పుగా ఉన్నట్లయితే పరీక్షలు రాయడానికి అనుమతి లేదన్నారు. అయినప్పటికీ అభ్యర్థికి సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖాధికారి పరిశీలించి విద్యార్థి అభ్యర్థన సరైనదేనని భావిస్తే పూర్తి సవరణలను రాష్ట్ర స్థాయిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అలాంటి అభ్యర్థులకు పేపర్-1 రాయడానికి అనుమతి లేక పోవడం వల్ల వారు చెల్లించిన ఫీజు అభ్యర్థి ఖాతాకు జమచేస్తామన్నారు. డిఇడి, బిఇడి రెండు అర్హతలు కలిగిన అభ్యర్థులు పేపర్1(ఎ) రాయడానికి వీలుగా బఫర్ హాల్ టికెట్స్ అందజేస్తామని తెలిపారు.

విజయవాడలో టెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

పరీక్షా కేంద్రాలను సందర్శించిన ప్రవీణ్ ప్రకాష్

విజయవాడలోని ఎపి టెట్ పరీక్షా కేంద్రాలైన గవర్నర్‌పేటలోని ఎస్‌విటి ఇన్ఫోటిక్, రామవరప్పాడులోని విజయ దుర్గా ఐటి సొల్యూషన్స్, కారూరులోని ఐఆన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రాలను పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో పాటు పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్, ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యువి సుబ్బారావు సందర్శించారు. అభ్యర్థుల పరీక్షల రాసే తీరును, పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.

ఉపాధి పనులు ప్రారంభించండి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రం నుండి వలసల నివారణకు ఉపాధి పనులు ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండు చేసింది. మంగళవారం సంఘం సమావేశం వడ్డేశ్వరంలోని రాష్ట్ర కార్యాలయంలో దడాల సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు పనులు లేక రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో గ్రామాలకు గ్రామాలు వలసలు పోతున్నారని తెలిపారు. కరువు ప్రాంతాల్లో ఉపాధి పనులు 150 రోజులు కల్పిస్తామని ప్రభుత్వం ప్రటించినా అన్ని జిల్లాల్లో పూర్తిగా అమలు కాలేదని పేర్కొన్నారు. వెంటనే ఉపాధి పనులు విస్తృతంగా కల్పించి వలసలు అరికట్టాలని కోరారు. సాగర్ కాలువ కింద అప్పుడే మంచినీటి ఎద్దడి ప్రారంభమైందని పేర్కొన్నారు. మంచినీటి కోసం మహిళలు చాలా దూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. మున్సిపాలిటీల్లో కలిపిన గ్రామాల్లో ఉపాధి పనులు ఉండటం లేదని, ఆయా గ్రామాల్లో కూడా పనులు కల్పించాలని కోరారు. జగనన్న గృహాలకు ఆర్థికసాయం చాలడం లేదని, ఎక్కువమంది అప్పులుచేసి కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇంటికి ఆరులక్షల చొప్పున ఇవ్వాలని కోరారు. సత్యసాయి జిల్లాలో పెనుగొండ, చిలమత్తూరు, నెల్లూరు జిల్లా పాపిరెడ్డిపాలెం, తిరుపతి జిల్లా నాయుడుపేట, తిరుపతి జిల్లా ఏర్పేడులో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించి వారిపై అక్రమ కేసులు పెట్టడాన్ని కండించారు.

గుంటూరు జిజిహెచ్‌లో కేన్సర్ ఆస్పత్రి విస్తరణకు ఎంఒయు

రూ.60 లక్షల విలువైన మందులను అందిస్తున్న నాట్కో ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లోని నాట్కో సెంటర్‌ను ఇటీవల లెవెల్-1 కేన్సర్ సెంటర్‌గా ప్రభుత్వం గుర్తించింది. ఇందు కోసం కేన్సర్ సెంటర్‌లో ఇప్పుడున్న వంద పడకలకు అదనంగా మరో వంద పడకలతో మరిన్ని వసతులు కల్పించేందుకు ఈ సెంటర్‌కు ఆనుకుని ఉన్న 1500 గజాల స్థలాన్ని నాట్కో ట్రస్ట్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇందుకు సంబంధించి వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కష్ణబాబు సమక్షంలో నాట్కో ప్రతినిధులు మంగళవారం ఎంఒయు కుదుర్చుకున్నారు. రూ.60 లక్షల విలువైన ఉచిత మందులను నాట్కో ప్రతినిధులు కృష్ణబాబుకు అందించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. నాట్కో కేన్సర్ సెంటర్‌కు 120 పోస్టులను మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. నాట్కో ఫార్మా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు, నాట్కో ఫార్మా వ్యవస్థాపకులు, నాట్కో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వి.సి.నన్నపనేని, డిఎంఇ డాక్టర్ నరసింహం, కేన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్ కుమార్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌డ్రాఫ్ట్‌కు ని'బంధ'నాలు'

- రాష్ట్రాల హక్కులపై కేంద్రం మరోదాడి
- నియంత్రణకు గ్రూపు ఏర్పాటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ద్రవ్య నియంత్రణ-బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బిఎం) పేరుతో ఇప్పటికే రాష్ట్రాల ఆర్థిక హక్కుల్లో జోక్యం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా మరోదాడికి సన్నద్ధమైంది. అరకొరగా ఉన్న అవకాశాలను వినియోగించు కుని ఓవర్ డ్రాఫ్ట్ తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ మాత్రపు వెసులుబాటు కూడాలేకుండా చేయడానికి కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ఓవర్‌డ్రాఫ్ట్, వేస్ అండ్ మీన్స్ విధానాలను మరింత కఠినం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ, రిజర్వు బ్యాంకులు త్వరలోనే రంగంలోకి దిగనున్నాయని సమాచారం. అత్యవసర పరిస్థితుల్లోనే ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకోవాలని ఇవి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్దేశిస్తున్నాయి,. రాష్ట్రాల ఆర్థికశాఖల కార్యదర్శులతో నిర్వహిస్తున్న సమీక్షల్లో దీనినే రిజర్వుబ్యాంకుతో పాటు, కేంద్ర ఆర్థికశాఖ అధికారులు కూడా ఇప్పటికే నొక్కి చెబుతున్నారు. అయితే, 'అత్యవసర పరిస్థితి' అంటే ఏమిటో కేంద్ర ప్రభుత్వం నిర్వచించడం లేదు. దీంతో రాష్ట్రాలు అత్యవసరమని భావించే అనేక అంశాలను రిజర్వు బ్యాంకుతో పాటు, కేంద్ర ఆర్థికశాఖ కూడా తిరస్కరించే అవకాశం ఉంది. ఇది అస్మదీయ రాష్ట్రాల పట్ల ఒక విధంగా, ఇతర రాష్ట్రాల పట్ల మరో విధంగా వ్యవహరిం చడానికి దారి తీసే అవకాశం ఉందన్న అభిప్రాయం ఆర్థిక శాఖ అధికారులతోపాటు, నిపుణుల్లో కూడా వ్యక్తమవుతోంది. ఈ భిన్నాభిప్రాయల నేపథ్యంలో ఓవర్‌డ్రాఫ్ట్‌ను క్రమబద్ధీ కరించే పేరిట కొన్ని రాష్ట్రాల ఆర్థిక కార్యదర్శులతో ఒక గ్రూపును కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ గ్రూపులో కూడా బిజెపి పాలిత రాష్ట్రాలకే ఎక్కువ ప్రాతినిధ్యం లభించినట్లు తెలిసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణం గానే ఈ గ్రూపు సిఫార్సులుంటాయి కదా!

ఇవీ ఆంక్షలు

ఇటీవల ఆర్థికశాఖల కార్యదర్శులతో నిర్వహించిన ఒక సమావేశంలో కొన్ని ముఖ్యమైన అంశాలతో కేంద్రం, రిజర్వ్‌బ్యాంకులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చాయి. దీనిలో ఓవర్‌డ్రాఫ్ట్‌కు సంబంధించి కొన్ని ఆంక్షలను పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంకు నుంచి తీసుకునే ఓడి, వేస్ అండ్ మీన్స్‌ను కేవలం అత్యవసర అవసరాలకే వాడుకోవాలని ఈ సమావేశంలో ప్రతిపాదించారు.

నగదు నిల్వల సమస్య నెల కొన్న సమయంలో స్వల్పకాలిక అవసరాల నిమిత్తం వినియోగించుకోవాలే తప్ప దీర్ఘకాలిక అవసరాలకు ఓడి తీసుకోకూడదని సూచించారు. ఎఫ్‌ఆర్‌బిఎం పరిధి దాటి వీటిని ఉయోగించుకోరాదని కూడా కేంద్రం స్పష్టం చేసింది. రాష్ట్రాల ఆర్థిక స్వేచ్ఛకు సంబంధించి అత్యంత కీలకమైన ఈ అంశంపై కూడా జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించినట్లు సమాచారం.

అనుకున్నవి చేశాం..

- 370 ఆర్టికల్ రద్దు, అయోధ్యలో రామమందిరం నిర్మించాం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, విశాఖపట్నం

ఏలూరులోని బూత్‌లెవెల్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్

బిజెపి ఏ లక్ష్యంతో అధికారంలోకి వచ్చిందో వాటిని పూర్తి చేస్తుందని రక్షణశాఖ మంత్రి రాజనాథ్ సింగ్ పేర్కొన్నారు. అందులో భాగంగానే జమ్ముకాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేశామని, అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి చేశామని, మూడోసారి అధికారంలోకి వస్తే భారత్‌దేశ శ్రేయస్సు, వికసిత్ భారత్ కోసం కృషి చేస్తామని చెప్పారు. విశాఖపట్నం, ఏలూరు జిల్లాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏలూరు జిల్లా ఇండోర్ స్టేడియంలో గోదావరి జోన్ బూత్‌స్థాయి కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పోలవరం ప్రాజెక్టుకు రూ.50 వేల కోట్లు నిధులివ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నా ఇక్కడి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయడంలేదని తెలిపారు. విశాఖపట్నం అతిపెద్ద సీపోర్ట్‌గా ఉన్నప్పటికీ రామయపట్నం పోర్టుకు అనుమతిచ్చా మని, పనులు ప్రారంభమయ్యాయన్నారు. వైసిపి ప్రభుత్వానికి దార్శనికత, అభివృద్ధి సంకల్పం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి, నాయకులు సోము వీర్రాజు, తపన చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని హామీలను నెరవేర్చాం : రాజ్‌నాథ్‌సింగ్

విశాఖ సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన భారత్ రైజింగ్ ఎలైట్ సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ భారతదేశం ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని, 2014లో 11వ స్థానంలో ఉండగా నేడు ఐదో స్థానానికి చేరిందని తెలిపారు. రష్యా - ఉక్రెయిన్ మధ్య జరిగిన యుద్ధంలో చిక్కుకున్న వేలాది మంది భారతీయ విద్యార్థులను స్వదేశానికి తీసుకువచ్చామని తెలిపారు. రానున్న కాలంలో ప్రతి జిల్లాకూ ఒక మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయనున్నామని హామీ ఇచ్చారు. దేశంలో న్యాయ వ్యవస్థలను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. మహిళలకు ప్రత్యేక భద్రత కల్పించే విధంగా చట్టాలను రూపొందించామన్నారు. విశాఖలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పురంధరేశ్వరి, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, సిఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

ఎపి ఆక్వాకు అధిక ధర

- 9వ ఆక్వా సాధికార కమిటీ సమావేశంలో పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎపి ఆక్వాకు అధిక ధర వస్తోందని, దేశీయంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆక్వా సాధికార కమిటీ ఛైర్మన్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాధికార కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, ఎప్పడా ఛైర్మన్ వడ్డి రఘురాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఒడిదుడుకులు గమనిస్తూ రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ ధరల స్థిరీకరణ కోసం కృషి చేయాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి ప్రభుత్వపరంగా ఎటువంటి సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో 3,57,863 ఎకరాల్లో పది ఎకరాలలోపు, 1,10,594 ఎకరాల్లో అంతకంటే ఎక్కువసాగు జరుగుతోందని పేర్కొన్నారు. ఆక్వాకు సంబంధించి రూ.43,548 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో 2,259 ఆక్వాహబ్‌లను ఏర్పాటు చేశామని, దీనిలో 1,962 హబ్‌లు ఇప్పటికే పనిచేస్తున్నాయని, వీటిద్వారా 657 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను విక్రయించామని తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు నీరబ్‌కుమార్ ప్రసాద్, కె విజయానంద్, గోపాలకృష్ణ ద్వివేది, జెన్‌కో ఎమ్‌డి చక్రధరబాబు, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు పాల్గొన్నారు.

ప్రజలకు చంద్రబాబు ఏం చేశారు?

- మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా వుండి ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలని పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. జగన్ ఈ నాలుగున్నరేళ్ల కాలంలో పేదరికం 11.5 శాతం నుంచి 5.5 శాతానికి తగ్గిందని అన్నారు. ఇది దేశంలోనే రికార్డు అని అన్నారు. మంగళగిరిలోని సికె కన్వెషన్ హాల్ వద్ద మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు 'రా.. కదిలిరా' సభ కోసం శ్రీకాకుళానికి వెళ్లి అన్నీ అబద్ధాలు చెప్పి వచ్చారని అన్నారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఎలా ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర కోసం ఏమి చేశారో చెప్పలేదని పేర్కొన్నారు. ఉద్దానంలో చావులకు చంద్రబాబే కారణమని ఆరోపించారు.

విశాఖ నగరంలో నిర్వహించిన మీట్‌లో పాల్గొన్న ప్రైవేట్ ఇన్వెస్టర్లు

బహిరంగ మార్కెట్లో 'ఉక్కు' భూములు!

- ఇన్వెస్టర్లతో సమావేశం
- దశల వారీ అమ్మకానికి స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ప్రతిపాదన

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఊహించినట్టుగానే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ భూములను బహిరంగ మార్కెట్‌లో అమ్మకానికి యాజమాన్యం తెగబడింది. దీనిలో భాగంగా విశాఖలో ఆర్‌ఐఎన్‌ఎల్ యాజమాన్యం ఇన్వెస్టర్ల మీట్ నిర్వహించింది. దీనికి కొంతమంది పెట్టుబడిదారుడు, బ్యాంకర్లు, బిడ్డర్లు, డవలపర్‌లు, క్రెడాయ్ ప్రతినిధులు హాజరయ్యారు. ప్రతిపాదన కోసం అభ్యర్థన అంటే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పి) ప్రకటన ప్రకారం ఈ నెల 28న ప్రీ బిడ్ సమావేశం నిర్వహిస్తారు. ఇఎండిని ఎవరైనా సమర్పించడానికి చివరి తేదీగా మార్చి 5ని నిర్ణయించారు. మార్చి 13న ఇ-ఆక్షన్ (వేలం) నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐఎన్‌ఎల్, ఎన్‌బిసిసి, ఎన్‌ఎల్‌ఎంసి అధికారులు వెల్లడించారు. ఆర్‌ఐఎన్‌ఎల్ హెచ్‌ఆర్ విభాగం (సిజిఎం) జి.గాంధీ, ఎన్‌బిసిసి (ఇంజనీరింగ్ విభాగం) జిఎం జి.రాజారామ్, ఎన్‌ఎల్‌ఎంసి జనరల్ మేనేజర్ రోహిన్ కొప్పురవూరి పాల్గొని పైతేదీలను బహిరంగ పరిచారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు 'నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్'ను కేంద్రంలోని మోడీ సర్కారు ఏర్పాటు చేసింది. గతంలో ఆయిల్ కంపెనీలు, ఎయిర్ పోర్టులు, పోర్టులు, రైల్వేలపై తీసుకున్న విధానాన్నే స్టీల్‌ప్లాంట్‌లో అమలు చేస్తోంది. ప్రస్తుతం విశాఖ నగరంలోని 13.89 ఎకరాల్లోగల హెచ్‌బి కాలనీ-మద్దిలపాలెంలో 11.80 ఎకరాలు, ఆటో నగర్‌లో రెండు ఎకరాలు, పెదగంట్యాడలో 0.89 ఎకరాలులోగల స్థలాలు, ప్లాట్‌లు, బ్లాక్‌లను, స్టీల్‌ప్లాంట్ ఆస్తులను మానిటైజేషన్‌లోకి తీసుకెళ్లింది. హెచ్‌బి కాలనీలోని ప్లాట్ పరిమాణం 129 నుంచి 450 చదరపు గజాల వరకు ఉంటుంది. దాని రిజర్వు ధర చదరపు గజానికి రూ.70,200 నుంచి రూ.85,800 వరకు ఉంది. ఇలా మొత్తం అందుబాటులోగల 111 ప్లాట్ల (14 బ్లాక్‌ల)ను అమ్మకానికి ఉక్కు యాజమాన్యం ఉంచింది. ఆటో నగర్‌లోని బ్లాక్‌ల పరిమాణం 1676 నుంచి 2895 చదరపు గజం వరకూ ఉండగా, దీని రిజర్వు ధర చదరపు గజానికి రూ.30 వేల నుంచి రూ.32 వేలుగా ఉంది. ఇలాంటివి నాలుగు బ్లాక్‌లను అమ్మకానికి ప్లాంట్ యాజమాన్యం అందుబాటులో పెట్టింది. పెదగంట్యాడలోగల సింగిల్ బ్లాక్ పరిమాణం 435 చదరపు గజాలు. దీని రిజర్వు ధర చదరపు గజానికి రూ.20,500. మొత్తం రూ.480 కోట్లుగా అంచనా వేస్తున్నారు. తక్షణంగా రూ.1000 కోట్ల ఆదాయం ఆర్జనే లక్ష్యంగా స్టీల్ యాజమాన్యం ప్రయత్నాలు ప్రారంభించింది. సొంత గనులను కేంద్ర ప్రభుత్వం కేటాయించకుండా, తక్షణమే రూ.5 వేల కోట్లు పెట్టుబడులు సమకూర్చకుండా ఏ పరిష్కారమైనా తాత్కాలికమే తప్ప శాశ్వతంగా ప్లాంట్‌ను నడిపేవి కావంటూ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు.

గ్రూప్2 మెయిన్స్‌కు 1:100 చొప్పున ఎంపిక చేయండి

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 25న జరిగిన గ్రూప్ 2 ప్రిలిమనరీ పరీక్షలను రాసిన వారినుండి మెయిన్స్‌కు ఎంపిక చేసేందుకు 1:50 కాకుండా 1:100 చొప్పున అభ్యర్థులను ఎంపిక చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి రామన్నతో కలిసి ఆయన ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్‌కుమార్, సభ్యులు పరిగె సుధీర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రూప్ 2 పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు తగినంత సమయం ఇవ్వకపోవడంతో పాటు పాఠ్యాంశాల్లో లేని అంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఇచ్చారని తెలిపారు. మెంటల్ ఎబిలిటి ప్రశ్నలు కూడా కఠినంగా వున్నందున అభ్యర్థులకు నష్టం జరగకుండా మెయిన్స్‌కు 1:100 తరహాలో అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. అలాగే డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వై రాము, జి రామన్నలు ఎపిపిఎస్‌సి ఛైర్మన్‌కు గ్రూప్2 పరీక్షలు రాసిన వారి నుండి మెయిన్స్‌కు 1:100శాతం నిష్పత్తిలో ఎంపిక చేయాలని వినతి పత్రం అందజేశారు.

ఇచ్చిన హామీలపై జిఓలివ్వండి

సిఎస్‌కు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం సమ్మె విరమణ కోసం అంగన్‌వాడీలతో చేసుకున్న ఒప్పందాలపై తక్షణం జిఓలివ్వాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్ సుప్రజ మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 42 రోజులపాటు అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్‌లు సమ్మెలో వున్నపుడు ప్రభుత్వం సమ్మెను విరమింపజేసేందుకు హామీలు ఇచ్చిందని తెలిపారు. సెక్టార్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు టిఎ, డిఎలు ఇవ్వాలని, జిఒ 47ను సవరించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్చడం, మరణించిన వారికి మట్టి ఖర్చులు, సంక్షేమ పథకాల పరిధిలోకి తీసుకురావడం, సమ్మె కాలంలో అంగన్‌వాడీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయడం, వైఎస్సార్ సంపూర్ణ మెనూను పెంచడం, నాలుగు యాప్‌లను ఒకే యాప్‌లోకి తీసుకురావడం, అర్హత కలిగిన అంగన్‌వాడీలకు ఇళ్ల స్థలాలను ఇచ్చేలా ఉత్తర్వులను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 42 రోజుల సమ్మె కాలానికి వేతనాలను తక్షణం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

మిలాన్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న నౌకలు

ముగిసిన మిలాన్ వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి జరుగుతున్న మిలాన్ - 2024 వేడుకలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు సముద్ర దశలో 35 యూనిట్లకు చెందిన సభ్యులతోపాటు ఓడలు, జలాంతర్గాములు, 13 నౌకలు, ఒక విమానం, రెండు విమాన వాహక నౌకలు, భారత నావికా దళం నుంచి స్వదేశీ వాహక నౌకలు, ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్ పాల్గొన్నాయి. భద్రతా పరమైన విన్యాసాలు చేపట్టాయి. ముగింపు వేడుకల్లో భాగంగా కమాండింగ్ ఆఫీసర్లు ఐఎన్ఎస్ విక్రాంత్‌లో సమావేశమై మిలాన్ ఆవశ్యకతను, పరస్పర సహకారానికిగాను తమ అనుభవాలను పంచుకున్నారు.

'సుప్రీం'కు కొణతాల పిటిషన్ బదిలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కొణతాల రామకృష్ణ రాష్ట్ర హైకోర్టులో దాఖలు చేసిన ప్రత్యేక హోదా పిటిషన్ సుప్రీంకోర్టుకు బదిలీ అయింది. పార్లమెంటులో నాటి ప్రధాని హామీ ఇచ్చిన ప్రత్యేక హోదాను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర హైకోర్టులో కొణతాల రామకృష్ణ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయవాది ఇలాంటి కేసులు సుప్రీంకోర్టులో ఉన్నాయని, అందువల్ల సుప్రీంకోర్టుకు ఈ పిటిషన్ బదిలీ చేయాలని కోరారు. అందుకు కొణతాల తరపున న్యాయవాది కూడా అంగీకరించారు. దీంతో మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనమూ అందుకు అంగీకరించింది. ఎపి హైకోర్టు నుంచి పిటిషన్ బదిలీ చేసి, ఇప్పటికే ఉన్న కేసులకు ఈ కేసును ట్యాగ్ చేసేందుకు అంగీకరించిన ధర్మాసనం, ఏప్రిల్ 5న ఇప్పటికే ఉన్న కేసులతో పాటు ఈ కేసునూ విచారిస్తామని తెలిపింది. కొణతాల తరపున న్యాయవాది అరుంధతీ ఖడ్జు విచారణకు హాజరయ్యారు.

ఆదివాసీల హక్కులు హరిస్తున్న కేంద్రం

'ఇస్రో' భవనం జాతికి అంకితం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

సుమారు రూ.1800 కోట్ల ఖర్చుతో నిర్మించిన మూడు ప్రధానమైన అంతరిక్ష ప్రయోగాలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మంగళవారం ప్రారంభించారు. కేరళ రాష్ట్రం తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్లో 'పిఎస్ఎల్‌వి ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ' భవనం, మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో 'సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ అండ్ స్టేజ్‌టెస్ట్ ఫెసిలిటీ' ప్లాంట్, విఎస్ఎస్‌సి వద్ద 'ట్రైసోనిక్ విండ్ టన్నెల్'ప్లాంట్‌ను మోడీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. దీనివల్ల ఏడాదికి 15 వరకూ ప్రయోగాలు జరపడానికి వీలుంటుందన్నారు.

- అడవులను, సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర
- ఐద్వా జాతీయ సహాయ కార్యదర్శి తపసి ప్రరాజ్

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆదివాసీల హక్కులను కేంద్రంలోని మోడీ సర్కారు హరిస్తోందని, అడవులను, సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలు తీవ్రమవుతున్నాయని ఐద్వా జాతీయ సహాయ కార్యదర్శి తపసి ప్రహరాజ్ అన్నారు. ఆదివాసీ గిరిజన మహిళా సంఘం (ఐద్వా అనుబంధం) ఆధ్వర్యాన అరకువేలీలోని గిరిజన భవన్‌లో మంగళవారం 'రాజ్యాంగ పరిరక్షణ - ఆదివాసీల ఉపాధి భద్రత' అన్న అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం హడావిడి చేస్తున్న 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' ఏ విధంగానూ ఆదివాసీల హక్కులు, చట్టాలు, ఉపాధి రక్షణకు తోడ్పడడంలేదన్నారు. అడవులను, సహజ వనరులను బడా సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం అటవీ చట్టాలకు తూట్లు పొడుస్తోందని విమర్శించారు. కులం, మతం పేరిట ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలపై తీవ్ర దాడి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వమూ గిరిజనులకు చేసిందేమీ లేదని విమర్శించారు. జిఒ 3ని పునరుద్ధరించి, చట్టబద్ధత కల్పించి ఆదివాసీలకు షెడ్యూల్డ్ ప్రాంతంలో వంద శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఇప్పటి వరకూ ఆదివాసీ యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేశామని చెప్పడం తప్ప ఆమెకూ గౌరవం ఇవ్వడంలేదన్నారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. ఆదివాసీలకు ఆహార భద్రత కల్పించడం కోసం కుటుంబానికి నెలకు 50 కిలోల బియ్యం ఉచితంగా అందించాలని, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ఉజ్వల్ యోజన పథకం కింద ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ఏజెన్సీలో 200 రోజులు పని కల్పించి, రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలసల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. సదస్సులో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, నాయకులు టి కౌసల్య, ఎస్ హైమావతి, వివి జయ, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు కె భాగ్యవతి, నాయకులు శశికళ, దేవుడమ్మ, కాసులమ్మ, శ్రామిక మహిళా సంఘం నాయకులు నాగమ్మ, వెంకటలక్ష్మి, కొండమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న తపసి ప్రరాజ్

ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
IKF Home Finance
ప్లాట్ నం.30/ఎ, సర్వే నం.83/1, మై హోమ్ ట్విట్జా, 11వ అంతస్తు, డైమండ్ హిల్స్, లుంబిని అవెన్యూ, 400/220/132కెవి జిఐఎస్ సబ్ స్టేషన్ ప్రక్కన, ఎపిఐఐసి హైదరాబాద్ నాలెడ్జి సిటీ, రాయదుర్గ్, హైదరాబాద్-081. ఫోన్ : 040-23412083.

స్వాధీనతా ప్రకటన
సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 రూల్ 8(1)తో చదువుతూ అనుబంధం-IV క్రింద)

లోన్ ఎకౌంట్ నం.: LNVJY00321-220003135

ఏదైతే మెసెర్స్. ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002, మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, యొక్క రూల్ 9 మరియు 3 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద **తేది : 15.12.2023న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది. పిలువబడిన రుణగ్రహీతలు **శ్రీమతి. సరోజ సత్యవరపు, భర్త. సత్యనారాయణ సత్యవరపు (రుణగ్రహీత), 2. శ్రీ.సత్యనారాయణ సత్యవరపు, తండ్రి. గోపాలకృష్ణ సత్యవరపు,** డో.నం.12-300, టైలరింగ్ వీధి, వెంకటరావు హోటల్ ప్రక్కన, కృష్ణ, గుడివాడ-521301. మరియు ఇక్కడ కూడా : డో.నం.16-321, సత్యనారాయణపురం, గుడివాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521 301 (సహ రుణగ్రహీత), పేర్కొన్న నోటీసులో చెల్లించడానికి ఉన్న మొత్తం **హెచ్ఎల్ రూ. 20,83,106/- (ఇరవై లక్షల ఎనభై మూడు వేల ఒక వందా ఆరు రూపాయలు మాత్రమే)** 12.12.2023 నాటికి వడ్డీతో కలిపి, పెనాల్ వడ్డీ, ఛార్జీలు, ఖర్చులు మొదలైన వాటితో సదరు నోటీసు తేది నుండి 60 రోజులలో చెల్లించమని కోరడమైనది.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమేమనగా దిగువసంతకాదారు సెక్యూర్డ్ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని **26.02.2024న** స్వాధీనం చేసుకున్నారు.

రుణగ్రహీత సెక్యూర్డ్ అసెట్స్‌ని రీడీమ్ చేయడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై దృష్టి సారించబడింది.

రుణగ్రహీత, తరకాదారు మరియు హామీదారులు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమేమనగా దిగువ ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపరాదని అలా జరిగినచో మీరు చార్జీ చేయబడతారని మెసెర్స్ ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు మొత్తం **రూ.20,83,106/- (ఇరవై లక్షల ఎనభై మూడు వేల ఒక వందా ఆరు రూపాయలు మాత్రమే)** 12.12.2023 నాటికి వడ్డీతో కలిపి పెనాల్ వడ్డీ, ఛార్జీలు, దానిపై ఖర్చులు మొదలైనవి చెల్లించి జరుపవలెను.

షెడ్యూల్-ఎ : స్థిరాస్తుల వివరణ

1వ అంశం : కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధి, గుడివాడ ఏరియా పరిధిలోని గుడివాడ గ్రామం వద్ద ఉన్న మూల్యాంకనం నం.1068017759, డో.నం.16-36, 16-37, ఆర్.ఎస్.నం.175 లో స్థలం మరియు భవనం ముక్క మరియు పార్సిల్ ఉన్న ఆస్తి యూనిట్ స్థలం కొలత 510 చ.గ.లు., **హద్దులు : తూర్పు** : ఆదుసుమిల్లి వెంకట నారాయణ చౌదరికి చెందిన ఆస్తి, **దక్షిణం :** ఇన్నమూరి కోటేశ్వరరావుకు చెందిన ఆస్తి, **పడమర :** మున్సిపల్ బజార్, **ఉత్తరం :** మున్సిపల్ బజార్. పై సరిహద్దుల పరిధిలో 510 చ.గ.లు. ఈ 1/30వ అవిభక్త ఉమ్మడి వాటా 17.00 చ.గ.లు. 14.21 చ.మీ.లు. సైట్ మరియు

2వ అంశం : పై ఎ షెడ్యూల్ లో కనిపించే సైట్ మొత్తంలో నిర్మించబడిన **"సాయికృష్ణ రెసిడెన్సీ"**లోని ఒకటవ లో ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్1 డో.నం.16-37. **హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్6, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్2.

ఈ సరిహద్దుల **"సాయికృష్ణ రెసిడెన్సీ"**లోని ఒకటవ అంతస్తులో ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్1 ప్లింత్ ఏరియా 610.46 చ.అ.లు., కామన్ ఏరియా 183 చ.అ.లు. మరియు పార్కింగ్ ఏరియా మరియు అన్నీ ఉపకరణాలతో, తలుపులు, కిటికీలు మొదలైన వాటితో జోడించబడిన లెట్రిన్ బాత్రూములు, విద్యుత్ ఫిట్టింగులు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ డిపాజిట్ మరియు డ్రైనేజి కనెక్షన్‌లో ఉమ్మడి హక్కులు, లిఫ్ట్, నీరు, కామన్ మెట్లు, కామన్ సౌకర్యాలు మరియు అన్నీ సౌలభ్యాలు.

తేది: 26.02.2024, ప్రదేశం: గుడివాడ — సం/- అధీకృత అధికారి, ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (यूनियन बैंक ऑफ इंडिया, भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ)
గవర్నర్‌పేట బ్రాంచి -01451, డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ - 520002

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(RULE 8(1) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** గవర్నర్‌పేట బ్రాంచి, డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ -520002, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత : శ్రీ తుమ్మల జమున** గారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 22,85,660.07/- (అక్షరాలా ఇరవై రెండు లక్షల ఎనభై ఐదు వేల ఆరు వందల అరవై రూపాయల ఏడు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేదీ. 21-10-2023న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 8 ప్రకారము **తేది. 23-02-2024** న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవిలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట ఇఎబి బ్రాంచి వారికి చెల్లించవలసిన బకాయి **రూ. 22,85,660.07/- (అక్షరాలా ఇరవై రెండు లక్షల ఎనభై ఐదు వేల ఆరు వందల అరవై రూపాయల ఏడు పైసలు మాత్రమే)** + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు / హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

విజయవాడ, గవర్నర్‌పేట, కొత్త మున్సిపల్ వార్డు నెం. 24, పాత మున్సిపల్ వార్డు నెం. 21, డోర్ నెం. 29-3-8 వద్ద సత్య లక్ష్మి అపార్ట్‌మెంట్ నందు ప్లింత్ ఏరియా 896 చ॥అ॥లతో రెండవ అంతస్తు నందు ఫ్లాట్ నెం. 2కి చెందిన ఆర్‌సిసి రూఫ్డ్ 2 బిహెచ్‌కె రెసిడెన్షియల్ ఫ్లాట్. **హద్దులు : తూర్పు :** కారిడార్, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** ఎస్. భాస్కరం గారి ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్-3 ఆస్తి, **ఉత్తరం :** శూన్యాకాశము. **స్థలమునకు హద్దులు : తూర్పు :** మున్సిపల్ రోడ్డు - 43.10 అ॥, **దక్షిణం :** అలుగోజు రామన్న గారి ఆస్తి - 78.00 అ॥, **పడమర :** గోవిందరాజు పూర్ణచంద్రరావు గారి ఆస్తి - 43.10 అ॥, **ఉత్తరం :** సాంబ్రాజ్య లక్ష్మి గారి ఆస్తి - 78.00 అ॥.

తేది : 23-02-2024
స్థలం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కృష్ణా బేసిన్‌కు నీటి ఎద్దడి

- జలాశయాల్లో భారీగా తగ్గిన నిల్వలు
- పులిచింతలలో 5.61 టిఎంసిలకు తగ్గిన వైనం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా పరివాహక ప్రాంతంలో ఈ ఏడాది వేసవిలో తాగునీటి ఎద్దడి పొంచి ఉంది. గత ఆరు నెలలుగా సరైన వర్షాలు లేక తెలుగు రాష్ట్రాల్లోని జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో తగిన వర్షాలు లేక ఆల్మట్టి పూర్తి స్థాయిలో నిండకపోవడంతో గత ఖరీఫ్ సీజన్లో కృష్ణా పరివాహక ప్రాంతంలో తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది. ఎగువ నుంచి నీటి ప్రవాహం రాకపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోయాయి. ప్రధానంగా శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసిలు కాగా, మంగళవారం 37.91 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. నాగార్జున సాగర్‌లో గరిష్ట నీటి నిల్వ 312.01 టిఎంసిలు. ప్రస్తుతం 142.79 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉన్నాయి. పులిచింతలలో 45.77 టిఎంసిలకుగాను 5.61 టిఎంసిలకు పడిపోయింది. ప్రధాన జలాశయాల్లో కనీస నీటి నిల్వలు కరువయ్యాయి. నాగార్జున సాగర్, శ్రీశైలంలో డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. పులిచింతలలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. రానున్న ఐదు నెలలు ఎండా కాలం కావడంతో పలు జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఉంటుందని జలవనరుల శాఖాధికారులు అంచనాకు వచ్చారు. ఎగువ రాష్ట్రాలను సంప్రదించేందుకు కూడా అవకాశం లేకుండాపోయింది. తెలంగాణలోని నారాయణపూర్ జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 37.64 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 22.34 టిఎంసిలు ఉన్నాయి. జూరాల జలాశయం గరిష్ట సామర్థ్యం 9.65 టిఎంసిలు. మంగళవారం సాయంత్రానికి 4.30 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. ఆల్మట్టి గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 129.72 టిఎసిలు. ప్రస్తుతం 59.50 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. దీంతో, కృష్ణా పరివాహక ప్రాంతాలైన కర్నూలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ ఏడాది తాగునీటికి ఇబ్బందులు తప్పేలా లేవు. పులిచింతల్లో నీటి నిల్వ బాగా తగ్గిపోవడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కూడా నీటి నిల్వ గణనీయంగా పడిపోయింది. గరిష్ట నీటి నిల్వ 3.08 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 2.26 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. దీంతో, గుంటూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, బాపట్ల జిల్లాలకు కనీసం చెరువులు నింపుకోవడానికి కూడా ఇబ్బంది రానుంది. నాగార్జున సాగర్‌లో నీటి నిల్వ తగ్గడంతో పల్నాడు, ప్రకాశం జిల్లాలకు నీటి ఎద్దడి ఏర్పడనుంది. గత కొన్ని నెలలుగా వర్షాలు లేకపోవడం, భూగర్భ జలాల నిల్వలు తగ్గిపోవడంతో సమస్య తప్పేలా లేదు. గత పది రోజుల నుంచి ఎండల తీవ్రత పెరుగుతోంది.

ఈ ఏడాది జులై నుంచి ఇప్పటి వరకు ఎగువ నుంచి వరద ప్రవాహం రాకపోవడంతో ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుతం తాగు నీటికే కటకటలాడే పరిస్థితి ఉంది. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న రబీ పంటలు, మొక్కజొన్న, జొన్న సాగుకు నీరు ఇవ్వలేమని అధికారులు చెప్తున్నారు. ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో కలిపి 2.50 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు.

ఈ పంటకు ఇంకా కనీసం ఒక తడికి నీరు అవసరం. ప్రస్తుతం సాగర్ నుంచి నీరు విడుదల చేసే పరిస్థితి లేదని అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో దాదాపు 200 గ్రామాల్లో నీటి సమస్య రావచ్చని అంచనా వేస్తున్నారు. ఏటా మేలో నీటి ఎద్దడి వస్తుందని, ఈ ఏడాది మార్చి చివరికే ఈ సమస్య రావచ్చని అంటున్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం కుడి కాలువకు మార్చిలో సాగర్ నుంచి ఐదు టిఎంసిలు విడుదల చేసే అవకాశం ఉందని జలవనరుల శాఖాధికారులు చెబుతున్నారు.

ఎన్నికల్లో పోటీ చేయను

- మంగళగిరి ఎమ్మెల్యే ఆర్‌కె

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

రానున్న ఎన్నికల్లో తాను ఎంపిగా, ఎమ్మెల్యేగా ఎక్కడ నుంచీ పోటీ చేయడంలేదని గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్‌కె) తెలిపారు. మంగళగిరిలోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గ వైసిపి అభ్యర్థి బిసి సామాజిక తరగతికి చెందిన వారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో మూడోసారి వైసిపి అభ్యర్థి విజయానికి తాను కృషి చేస్తానని చెప్పారు. ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని గతంలో లాగానే ఇక్కడ విజయం సాధించి తీరుతామని అన్నారు. మార్చి మూడో తేదీన ప్రకాశం జిల్లా మేదరమెట్లలో జరిగే వైసిపి సిద్ధం సభకు మంగళగిరి నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో తరలించడానికి కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే ఆర్కే ఎవరూ చేయని విధంగా అభివద్ధి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు, వైఎస్‌పి నాయకులు డి వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన ఆశావహుల నిరసన ర్యాలీలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం(తూర్పు గోదావరి)

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో టిడిపి, జనసేన ఆశావహుల నిరసన ర్యాలీలు మంగళవారం హోరెత్తాయి. నిడదవోలు నియోజకవర్గానికి టిడిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును ప్రకటించాలని ఆయన అనుచరులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సర్పంచ్ లలితకుమారి మాట్లాడుతూ తొలి జాబితాలో శేషారావు పేరు లేకపోవడం నిరాశ కలిగించిందన్నారు. రాజమండ్రి రూరల్‌కు చెందిన జనసేన అభ్యర్థిని నిడదవోలుకు కేటాయిస్తున్నారనే సమాచారం తమను అసంతృప్తికి గురిచేసిందన్నారు. శేషారావుకు సీటును కేటాయించకపోతే రాజీనామా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నందిన శ్రీనివాస్, కరుటూరి మంగాయమ్మ, అంబటి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు రాజమహేంద్రవరం రూరల్ టికెట్‌ను జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్‌కి కేటాయించాలంటూ కడియంలోని దేవీచౌక్ సెంటర్ నుంచి రాజమహేంద్రవరం డీలక్స్ సెంటర్ వరకూ ఆయన అనుచరులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రాబల్యంలేని నిడదవోలుకు వెళ్లి పోటీ చేయమనడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ఈ ఈ కార్యక్రమంలో గట్టి నరసయ్య, గట్టి సుబ్బారావు, చెరుకూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నన్ను కొనాలని వైసిపి ప్రయత్నిస్తోంది : దస్తగిరి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన తనను ప్రలోభాలకు గురిచేసి తమకు అనుకూలంగా తిప్పుకునేందుకు సిఎం వైఎస్ జగన్, వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని దస్తగిరి ఆరోపించారు. హైదరాబాద్‌లోని సిబిఐ కోర్టుకు మంగళవారం హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ వివేకా కేసు జగన్ ప్రభుత్వానికి ఇబ్బందిగా మారిందన్నారు. ఆ కేసును నీరుగార్చేందుకు వైఎస్ అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తాను అప్రూవర్‌గా మారడానికి సిబిఐనే కారణమని కోర్టులో తనతో చెప్పించి వారందరూ కేసు నుంచి తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తాను జైలులో ఉన్నప్పుడు శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్యా రెడ్డి డాక్టర్‌గా తన వద్దకు వచ్చి అడ్వాన్స్ రూ.20 కోట్లు ఇస్తానని చెప్పాడని దస్తగిరి ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంతో తనకు ప్రాణహాని ఉందని, ఈ విషయాన్ని కోర్టు దృష్టికి కూడా తీసుకెళ్లాలని చెప్పారు. తనకు రక్షణ కల్పించాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి గతంలోనే విజ్ఞప్తి చేశానని తెలిపారు. తాను ఎటువంటి ప్రలోభాలకూ గురికానన్నారు. 'రాజకీయాల్లోకి దిగుతా... పులివెందులలో వైఎస్ జగన్‌ని ఢీ కొంటా' అని దస్తగిరి చెప్పారు.

తాగునీరు ఇప్పించండి

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలో తాగునీటి కోసం రోడ్డెక్కారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. ప్రధాన గేటు ఎదుట బైఠాయించి అధికారులకు, పాలకవర్గానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయం గేట్లను తోసుకుంటూ కమిషనరేట్‌లోకి దూసుకెళ్లారు. మహిళలకు మద్దతుగా ఈ ఆందోళనలో పురుషులు కార్యాలయం గేట్లను దూకి లోనికి ప్రవేశించారు. పోలీసులు అక్కడకు చేరుకుని గేట్లను మూసివేశారు. దీంతో మహిళలు గేటు వద్దే బైఠాయించి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్లు హరిత, బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. అనంతపురంలో నెలల తరబడి తాగునీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులకు చీమకుట్టినట్టైనా లేదన్నారు. పాతూరు, శారద నగర్, విజయనగర్ కాలనీ, బుడ్డప్పనగర్, నవోదయ కాలనీ తదితర ప్రాంతాల్లో నెల రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం బాధ్యతా రాహిత్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ హరిత భర్త జయరాం నాయుడు మాట్లాడుతూ అధికారులు, పాలకులకు పన్నులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంపై లేదని విమర్శించారు. మోటార్లను మరమ్మతు చేయించడం, కొత్త మోటార్లను కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కార్పొరేషన్ వద్ద డబ్బులు లేవంటే తామే ప్రజలతో బిచ్చమెత్తి ఇస్తామని అన్నారు. ఈ సమస్యపై కమిషనర్ మేఘ స్వరూప్ స్పందించి ఆందోళనకారులతో మాట్లాడారు. ఇప్పటికే నగరంలో నీటి సరఫరా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే నీటి ట్యాంకర్లను పంపుతామని హామీ ఇచ్చారు. ఈ హామీతో ఆందోళన విరమించారు.

ఫారం నెం.14
(రెగ్యులేషన్ 33(2) చూడండి)
రికవరీ అధికారి-II వారి కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
(ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం)
31-31-21, నారాయణ భవనం, సాయిబాబా స్ట్రీట్, దాబా గార్డెన్స్, విశాఖపట్నం-530020

డిమాండ్ నోటీసు
(డెట్స్ & బ్యాంక్రప్టసీ చట్టం, 1993 లోని రికవరీ యొక్క సెక్షన్స్ 25 నుండి 28 మరియు ఆదాయ పన్ను చట్టం, 1961లోని రెండవ షెడ్యూలు యొక్క రూలు 2 క్రింద ప్రకటన)
ఆర్.పి.నెం.476 ఆఫ్ 2018 ఇన్ ఓఏ నెం.310 ఆఫ్ 2015
మెసర్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్ (ఆర్సిల్), 207, 2వ అంతస్తు, భూవన టవర్స్, సిఎంఆర్ ఎక్స్‌క్లూసివ్ పైన, ఎస్.డి.రోడ్, పాట్నీ, సికింద్రాబాద్-500003
వర్సెస్
మెసర్స్ వేణుమాధవ కాటన్ ట్రేడర్స్ & ఇతరులు

టు,
(సిడి 1) మెసర్స్ వేణుమాధవ కాటన్ ట్రేడర్స్,
డోర్ నెం.19-7-659, బ్లాక్ 3బి, లాంచెస్టర్ రోడ్, సంగడిగుంట, గుంటూరు-522003.
(సిడి 2) శ్రీ గుంటూరు సుబ్రహ్మణ్యం, తండ్రి జి.నాగరాజు,
డోర్ నెం.11-60, అన్నపూర్ణ నగర్, అమరావతి రోడ్, గుంటూరు-522006.
(సిడి 3) శ్రీమతి గుంటూరు కృష్ణ కుమారి, భర్త జి.నాగరాజు,
డోర్ నెం.11-60, అన్నపూర్ణ నగర్, అమరావతి రోడ్, గుంటూరు - 522006.
(సిడి 4) శ్రీమతి కూచిపూడి సువర్ణ కుమారి, భర్త కె.ప్రసాద్,
డోర్ నెం.14-42-28, రవీంద్ర నగర్, మోరిస్‌పేట, తెనాలి-522202 మరియు ఇక్కడ కుడా: కెరాఫ్ బలరామకృష్ణ జిన్నింగ్ మిల్లు , టిఎస్ఆర్ వైవ్ బ్రిడ్జిడ దగ్గర, ఏటుకూరు బైపాస్ రోడ్డు, గుంటూరు.
(సిడి 5) శ్రీ బోరుగడ్డ విజయ్ కుమార్, తండ్రి సురేష్ బాబు,
డోర్ నెం.11-16-21/12, రామిరెడ్డి పేట్, నరసరావుపేట, గుంటూరు జిల్లా మరియు ఇక్కడ కూడా: డోర్ నెం.11-15-86 నుండి 11-15-87 వరకు, పేట సమితి ఆఫీస్ రోడ్, రామిరెడ్డిపేట, నరసరావుపేట-522601.

1. ఇందుమూలంగా గమనించాల్సిందేమనగా మీరు (ఉమ్మడిగా మరియు వ్యక్తిగతంగా/ పూర్తి/ లిమిటెడ్) బకాయిలు **మొత్తం రూ.99,12,398.10పై (రూపాయలు తొంభైతొమ్మిది లక్షల పన్నెండువేల మూడువందల తొంభైఎనిమిది & పదిపైసలు మాత్రమే)**లను రియలైజేషన్ వరకు **18.03.2015** నుండి నెలవారి వాయిదాలతో తదుపరి వడ్డీ @12.50% వార్షికంగా మరియు ఖర్చులతతోసహా **0A/310/2015**లోని గౌరవ ప్రిసైడింగ్ ఆఫీసర్, **డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం** వారిచే జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి రీకవరీ సర్టిఫికేట్ జారీచేయబడినది.
2. మీరు ఈ నోటీసు స్వీకరణ తేది నుండి 15 రోజుల్లోపు పై పేర్కొన్న మొత్తాలను చెల్లించాల్సిందిగా ఆదేశిస్తున్నారు, విఫలం చెందితే, రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ మరియు ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్ చట్టం, 1993 మరియు అందులో పేర్కొన్న రూల్స్‌ను అనుసరించి రికవరీ చేయబడును.
3. తదుపరి విచారణ తేదిన లేదా ముందుగా మీ ఆస్తుల యొక్క వివరాల అఫిడవిట్‌ను ప్రకటించాల్సిందిగా మిమ్మల్ని ఆదేశిస్తున్నారు.
4. మీరు తదుపరి విచారణ కొరకు **22.03.2024న ఉ.10.30గం.లకు** క్రింది సంతకందారుని సమక్షంలో హాజరు కావాల్సిందిగా ఆదేశిస్తున్నారు.
5. పై పేర్కొన్న మొత్తాలకు అదనంగా, మీరు దిగువ వాటిని కూడా చెల్లించాలి:
(ఎ) **ఎగ్జిక్యూషన్ ప్రొసీడింగ్స్ యొక్క ఈ నోటీసు తరువాత వెంటనే ప్రారంభ కాలవ్యవధికి కొరకు సదరు వడ్డీలను చెల్లించాలి.**
(బి) **బకాయిఉన్న సర్టిఫికేట్ మొత్తాల రికవరీ చేయడానికి ఈ నోటీసు మరియు ఇతర ప్రక్రియ యొక్క సేవలకు సంబంధించి వెచ్చించిన అన్ని ఖర్చులు, చార్జీలు మరియు వ్యయాలు.**

తేది.16.02.2024న ట్రిబ్యునల్ యొక్క సీలు వేసి నా సాహస్తాలతో ఇవ్వబడినది.

సం/- రికవరీ అధికారి
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు

నిట్ నెం.ఉ.161/టిఓ/2023-24, తేది : 24.02.2024

కృష్ణాజిల్లాలో డి.ఎమ్.ఎఫ్.గ్రాంట్ క్రింద **రూ.70.00 లక్షల** అంచనా విలువతో 1 రోడ్డు పని కొరకు ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లేస్ క్రింద ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. బిడ్ అప్‌లోడ్ మరియు డౌన్లోడ్ ప్రారంభ తేది : 29.02.2024 నుండి. వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ @ **www.tender.apeprocurement.gov.in** వద్ద చూడగలరు. ఫోన్ : 6305693265.

సం/- సూపరింటెండెంగ్ ఇంజనీర్, పంచాయతీరాజ్, మచిలీపట్నం, కృష్ణాజిల్లా.

DIPRNo:13240/CL/ADVT/1/1/2021-22

అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్
Arcil Premier ARC
ది రూబీ, 10వ అంతస్తు, 29 సేనాపతి బాపత్ మార్గ్, దాదర్ (పశ్చిమం), ముంబై-400 028.
సిఐఎన్ : U65999 MH2002PLC134884, వెబ్‌సైట్ : www.arcil.co.in
శాఖ చిరునామా : ఫ్లాట్ నం.207, 2వ అంతస్తు, భువన టవర్స్, ఎస్.డి.రోడ్డు, సికింద్రాబాద్-03, టెలి : 040-66028014.

అనుబంధం

బిజినెస్ లైన్- ఆంగ్లము (ఎపి మరియు తెలంగాణ) మరియు ప్రజాశక్తి- తెలుగు (విజయవాడ ఎడిషన్) లో 07 ఫిబ్రవరి, 2024 తేదిన ప్రచురించబడిన ఇ-వేలం విక్రయ నోటీసుకు జారీ చేయబడిన అనుబంధం.

రుణగ్రహీత వెంకటేశ్వర సిండికేట్‌కు సంబంధించిన వేలం నోటీసులో, 28 ఫిబ్రవరి, 2024న షెడ్యూల్ చేయబడిన వెంకటేశ్వర సిండికేట్ ఆస్తుల వేలం ఇప్పుడు **12 మార్చి, 2024, మ. 14.00 గం. నుండి రీ షెడ్యూల్** చేయబడిందని మరియు తదనుగుణంగా బిడ్‌ల సమర్పణకు చివరి తేదీ/సమయం **11 మార్చి, 2024, మ.15.00 గం.** వరకు నిర్ణయించబడిందని నోటీసు ఇవ్వడమైనది.

07 ఫిబ్రవరి, 2024న ప్రచురించబడిన ఇ-వేలం నోటీసులో పేర్కొన్న అన్నీ ఇరత వివరాలు మారవు.

తేది : 28.02.2024
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (यूनियन बैंक ऑफ इंडिया, भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ)
గవర్నర్‌పేట బ్రాంచి -01451, డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ - 520002

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(RULE 8(1) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** గవర్నర్‌పేట బ్రాంచి, డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ -520002, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత : శ్రీ తుమ్మల జమున** గారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 22,85,660.07/- (అక్షరాలా ఇరవై రెండు లక్షల ఎనభై ఐదు వేల ఆరు వందల అరవై రూపాయల ఏడు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేదీ. 21-10-2023న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 8 ప్రకారము **తేది. 23-02-2024** న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవిలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట ఇఎబి బ్రాంచి వారికి చెల్లించవలసిన బకాయి **రూ. 22,85,660.07/- (అక్షరాలా ఇరవై రెండు లక్షల ఎనభై ఐదు వేల ఆరు వందల అరవై రూపాయల ఏడు పైసలు మాత్రమే)** + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు / హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

విజయవాడ, గవర్నర్‌పేట, కొత్త మున్సిపల్ వార్డు నెం. 24, పాత మున్సిపల్ వార్డు నెం. 21, డోర్ నెం. 29-3-8 వద్ద సత్య లక్ష్మి అపార్ట్‌మెంట్ నందు ప్లింత్ ఏరియా 896 చ॥అ॥లతో రెండవ అంతస్తు నందు ఫ్లాట్ నెం. 2కి చెందిన ఆర్‌సిసి రూఫ్డ్ 2 బిహెచ్‌కె రెసిడెన్షియల్ ఫ్లాట్. **హద్దులు : తూర్పు :** కారిడార్, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** ఎస్. భాస్కరం గారి ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్-3 ఆస్తి, **ఉత్తరం :** శూన్యాకాశము. **స్థలమునకు హద్దులు : తూర్పు :** మున్సిపల్ రోడ్డు - 43.10 అ॥, **దక్షిణం :** అలుగోజు రామన్న గారి ఆస్తి - 78.00 అ॥, **పడమర :** గోవిందరాజు పూర్ణచంద్రరావు గారి ఆస్తి - 43.10 అ॥, **ఉత్తరం :** సాంబ్రాజ్య లక్ష్మి గారి ఆస్తి - 78.00 అ॥.

తేది : 23-02-2024
స్థలం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

sidbi
స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్పెషలైజ్డ్ అసెట్ రికవరీ బ్రాంచ్: 756-ఎల్, ఓవర్సీస్ టవర్స్, అన్నా సాలై, చెన్నై, తమిళనాడు-600 002,
Phone: 044-66636019 / 66636055, Website - www.sidbi.in

స్వాధీనతా ప్రకటన
(స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్-8(1) చూడండి)

ఏదైతే, క్రింది సంతకందారు **స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** (SIDBI) యొక్క అధీకృత అధికారిగా, స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్, 39 ఆఫ్ 1989 ప్రకారం స్థాపించబడింది మరియు దీని హెడ్ ఆఫీసు: SIDBI టవర్', 15అశోక్ మార్గ్, లక్నో-226001లో మరియు స్పెషలైజ్డ్ అసెట్ రికవరీ బ్రాంచ్/అసెట్ రికవరీ వర్టికల్ యూనిట్: 756-ఎల్, ఓవర్సీస్ టవర్స్, అన్నా సాలై, చెన్నై-600 002 వద్ద కలిగియుండి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 54 ఆఫ్ 2002 (ది ఆక్ట్) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **రుణగ్రహీత: వైష్ణవి ఫుడ్స్**కి సంబంధించి **10.07.2023** నుండి వడ్డీతోసహా **10.07.2023** నాటికి **రూ.3,38,45,671/-(రూపాయలు మూడుకోట్ల ముప్పైఎనిమిది లక్షల నలభైఐదువేల ఆరువందల డెబ్బైఒకటి మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ **(1)**తేది: **20-07-2023** నాటి డిమాండ్ నోటీసు మరియు **రుణగ్రహీత: వైష్ణవి స్పైసెస్ ఎల్ఎల్‌పి** సంబంధించి నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **10.08.2023** నుండి వడ్డీతోసహా **10.08.2023** నాటికి **రూ.8,62,84,363/-(రూపాయలు ఎనిమిది కోట్ల అరవైరెండు లక్షల ఎనభైనాలుగువేల మూడు వందల అరవైమూడు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ **(2)** తేది:**10-08-2023** నాటి డిమాండ్ నోటీసు జారీచేసినారు.

రుణగ్రహీతలు మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **22 ఫిబ్రవరి, 2024న** స్వాధీనంలోకి తీసుకున్నారు.

ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకాన్నీ ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏ విధంగానూ లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి **వైష్ణవి ఫుడ్స్**కు సంబంధించి **10.07.2023** నాటికి **రూ.3,38,45,671/-(రూపాయలు మూడుకోట్ల ముప్పైఎనిమిది లక్షల నలభైఐదువేల ఆరువందల డెబ్బైఒకటి మాత్రమే)** మరియు **వైష్ణవిస్పైసిస్ ఎల్ఎల్‌పి**కు సంబంధించి **10.08.2023** నాటికి **రూ.8,62,84,363/-(రూపాయలు ఎనిమిది కోట్ల అరవైరెండు లక్షల ఎనభైనాలుగువేల మూడువందల అరవైమూడు మాత్రమే)** మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలను రుణగ్రహీతలు శ్రద్ధ వహించగలరు.

స్థిరాస్తి యొక్క వివరణ:

శ్రీ.చాగంటి సాంబి రెడ్డికు చెందిన స్థిరాస్తి మొత్తం భాగం, గుంటూరు జిల్లా, మంగళగిరి ఉపజిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామ పంచాయతీ ఏరియా, కుంచనపల్లి గ్రామం, డోర్ నెం.11-11/బి కలిగిన ఎక 0.81 సెంట్ల భూమికిగాను 1877.60చ.గ.లకు సమానమైన ఎక 0.39 సెంట్ల భూమి, బురుజు మరియు **సరిహద్దులు:** ఉత్తరం: గొర్ల హరికృష్ణారెడ్డి మరియు ఇతరులకు చెందినసొంత మార్గం, తూర్పు: గోర్ల హరికృష్ణారెడ్డి మరియు ఇతరులకు చెందిన ఆస్తి, పడమర: ఎన్‌హెచ్ బై-పాస్ రోడ్డు, దక్షిణం: గోగినేని శ్రీనివాసరావు మరియు ఇతరులకు ఆస్తి. భూమికి అనుసంధానించబడిన లేదా శాశ్వతంగా భూమికి అనుసంధానించబడిన వాటిపై ఉన్న అన్ని భవనం మరియు నిర్మాణం మరియు ప్లాంట్ మరియు మెషీనరితోకలిపి.

తేది: 22-02-2024
ప్రదేశం: కుంచనపల్లి, గుంటూరు
సం/- అధీకృత అధికారి,
స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SIDBI)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (यूनियन बैंक ऑफ इंडिया, भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ)
ప్రత్తిపాడు బ్రాంచి
ప్రత్తిపాడు గ్రామము మరియు మండలం, గుంటూరు జిల్లా, ఎపి-522019. ☎ 0863-2280224

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1)}

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **పూర్వము ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: మెస్సర్స్ శ్రీ రామా సీడ్స్ - తరపున యజమాని: శ్రీ కోటపాటి సురేష్** మరియు **సహపూచీదారు: శ్రీ గంగుపెంట వేణుగోపాలరెడ్డి మరియు శ్రీమతి కోటపాటి వెంకాయమ్మ** వారు చెల్లించవలసిన **బకాయిమొత్తం 12.12.2023 తేదీనాటికి రూ.28,77,469.94/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల డెబ్బైఏడు వేల నాలుగు వందల అరవై తొమ్మిది రూపాయలు మరియు నలభై తొమ్మిది పైసలు మాత్రమే)** + వడ్డీ + బ్యాంక్ ఛార్జీలు సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.12.12.2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8 ప్రకారము **22-02-2024 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా **చెల్లించవలిసిన బకాయిమొత్తం 12.12.2023 తేదీనాటికి రూ.28,77,469.94/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల డెబ్బైఏడు వేల నాలుగు వందల అరవై తొమ్మిది రూపాయలు మరియు నలభై తొమ్మిది పైసలు మాత్రమే)** + వడ్డీ మొ॥ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జికి లోబడి ఉంటాయి.

సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తుల వివరములు

ఆస్తి యొక్క మొత్తం భాగము మరియు యావదాస్తిని కలిగి ఉంటుంది:

1) ఎపి, గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-జిల్లా, ప్రత్తిపాడు గ్రామము మరియు మండలం, వార్డు నెం.1, సమీప డోర్ నెం.1-04, సర్వే డి.నెం.231/బి నందు **శ్రీమతి కోటపాటి వెంకాయమ్మకు చెందిన** $133^{1}/_{3}$ చ॥గ॥ విస్తీర్ణముగల ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు (దస్తావేజులు ప్రకారము): తూర్పు:** షేక్ సుభాని యొక్క స్థలము; **దక్షిణం:** షేక్ ఇస్మాయిల్ యొక్క డాబా స్థలము; **ఉత్తరం:** గోగుల లక్ష్మి కాంతమ్మ యొక్క స్థలము; **పడమర:** పంచాయతీ రోడ్డు.

2) ఎపి, గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-జిల్లా మరియు మండలం, యనమదల గ్రామము, తిక్కిరెడ్డిపాలెం గ్రామపంచాయతీ, యనమదల డి.నెం.167 నందు మొత్తం య॥ 1.90 సెంట్లు విస్తీర్ణములో **శ్రీమతి కోటపాటి వెంకాయమ్మకు చెందిన** 150 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.8 ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు (దస్తావేజులు ప్రకారము): తూర్పు:** విక్రేత చేత వదిలివేయబడిన 25 అ॥ వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** చింతా సాంబ్రాజ్యంకు చెందిన ప్లాట్ నెం.7; **ఉత్తరం:** పాతోజు ఆదిలక్ష్మికి చెందిన ప్లాట్ నెం.9ఎ; **పడమర:** ప్లాట్ నెం.11 స్థలము. **(ఈ హద్దుల మధ్యలోని 150 చ॥గ॥ల ఖాళీస్థలము).**

3) ఎపి, గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు గ్రామము మరియు మండలం, సమీప డోర్ నెం.1-226, సర్వే డి.నెం.227 నందు **శ్రీ కోటపాటి సురేష్‌కు చెందిన** 92 చ॥గ॥ లేదా 76.92 చ॥మీ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.22 ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు (దస్తావేజులు ప్రకారము): తూర్పు:** ప్లాట్ నెం.27; **దక్షిణం:** ప్లాట్ నెం.21; **ఉత్తరం:** ప్లాట్ నెం.23; **పడమర:** 20 అ॥ వెడల్పుగల రోడ్డు.

ప్రదేశము : ప్రత్తిపాడు
తేది : 22.02.2024
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

ప్రమాదాలు!

రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. రాష్ట్రంలో గత వారం రోజులుగా చోటుచేసుకున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సోమవారం ఒక్కరోజే వేర్వేరు ప్రమాదాల్లో పదిమందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 25 మందికిపైగా తీవ్ర గాయాల పాలయ్యారు. మరో ఘటనలో... మిర్చి యార్డులో మిరప పంట అమ్మగా వచ్చిన రూ.10 లక్షల నగదుతో ఇంటికి బయల్దేరిన ముగ్గురు రైతులు ఆటో ప్రమాదంలో నగదుతోపాటు బుగ్గి కావడంతో ఆ కుటుంబాల వేదన వర్ణనాతీతం. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత సైతం ఈ వారంలోనే కారు ప్రమాదానికి బలయ్యారు...ఇలా ఎన్నో ప్రమాదాలు.

ఏడెనిమిది సెకన్లలోనే వంద కిలోమీటర్లకుపైగా వేగాన్నందుకునే బైకులు, కారులు, ఇతర వాహనాలు ఒక వైపు... రాష్ట్రంలో గుంతలు, ఎగుడుదిగుళ్లతో నరకానికి నకళ్లుగా మారిన రహదారులు మరోవైపు.. ఉన్నాయి. మితిమీరిన వేగానికి తోడు నిద్ర లేమి, విపరీతమైన పని ఒత్తిడి, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం.. ఇవన్నీ విలువైన ప్రాణాలను బలిగొంటున్నాయి. కొన్ని దేశాల్లో వాహనాల ఉత్పత్తి దశలోనే స్పీడ్ కంట్రోల్‌కు అవసరమైన చర్యలు చేపట్టి అద్భుత ఫలితాలు సాధిస్తుండగా, మనదేశంలో అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. కార్పొరేట్ల ఒత్తిడికి తలొగ్గి అభివృద్ధి చెందిన దేశాల రహదారులకు అనువైన మితిమీరిన వేగంతో వెళ్లే వాహనాలకు ఇక్కడ అనుమతిస్తున్నారు. వీటికి అనుమతించడంలో ఉన్న శ్రద్ధ, రహదారుల అభివృద్ధిపైనా, సరైన భద్రతా ప్రమాణాలను నెలకొల్పడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేకపోవడం... సామాన్యుల ఉసురుతీస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఏటా 13 లక్షల మంది ఉసురుతీస్తున్నాయి. మరో రెండు కోట్లకుపైగా క్షతగాత్రులవుతున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి గంటకు 53 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారని 2022 నాటి కేంద్రప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీరిలో 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వారే 69 శాతం. అంతకుముందుటేడాదితో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రమాదాలు 5 శాతం తగ్గితే, మనదేశంలో 11.9 శాతం ప్రమాదాలు, 9.45 శాతం మరణాలు, 15.3 శాతం క్షతగాత్రులు పెరగడం ఆందోళనకరం. క్షతగాత్రులకు వీలైనంత వేగంగా వైద్య చికిత్స అందేలా చూడటం అత్యంత ప్రధానమైనదే. తీవ్రగాయాల పాలైన కుటుంబ సభ్యుల వైద్యం కోసం చాలా కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి.

మన రాష్ట్రంలో ద్విచక్ర వాహన ప్రమాదాలే అత్యధికంగా చోటుచేసుకుంటున్నాయి. గత ఏడాది మొత్తంగా 18,413 ప్రమాదాలు జరిగాయి. వీటిలో 7,977 మంది ప్రాణాలు కోల్పోగా, 20 వేల మంది గాయాల పాలయ్యారు. వీటిలో అత్యధికంగా 6,370 ద్విచక్ర వాహన ప్రమాదాలే. కార్లు, జీపుల వంటి వాహనాలు 4,462, ఆటోలు 1,869 ప్రమాదాలకు గురయ్యాయి. ఇక బస్సు ప్రమాదాలు భారీగానే జరిగాయి. గత కొంతకాలంగా గ్రామీణ రూట్లలో కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా కాలం చెల్లిన వాటితోనే రోజులు గడపడం, నిర్వహణ లోపం కారణంగా ఆర్‌టిసిలో మంచి అనుభవం ఉన్న డ్రైవర్లు ఉన్నప్పటికీ బస్సులు ప్రమాదాల బారినపడుతున్నాయి.

ఉపాధి మార్గాలు కుంచించుకుపోతున్నాయి. మోడీ సర్కారు ఏలుబడిలో... గత మూడేళ్లలో ఉపాధి హామీ పనిదినాలు కోటి తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో పనులు వెతుక్కుంటూ దూర ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. పనికోసం నిత్యం ఆటోలు, లారీలు, వ్యాన్లు తదితర వాహనాల్లో వెళ్లే... వీరు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి. రోడ్ సెస్ వసూలు చేయడంపైనున్న శ్రద్ధలో కొంతయినా రోడ్ల నిర్వహణపై పెట్టాలి. వసూలైన సెస్ సొమ్ము కొత్త రోడ్ల నిర్మాణానికి, ఉన్నవాటి నిర్వహణకు మాత్రమే ఉపయోగించాలి. అలాగాకుండా ప్రభుత్వాలు 'తమ' ప్రాధాన్యతలను బట్టి మళ్లించకుండా కట్టుదిట్టమైన నిబంధనలుండాలి. రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకునేందుకు సకల చర్యలు చేపట్టాలి.

మహనీయుల మాట

పాఠకుని నుంచి తక్కువ సమయం తీసుకుని ఎక్కువ విజ్ఞానం అందించే రచయిత ప్రతిభావంతుడు.

- సి.సి. కోల్టన్,
బ్రిటిష్ రచయిత.

సామాజిక సాధికారత ఇదేనా...?

వ్యాసం

> **షెడ్యూల్డ్ ప్రాంత స్థానిక ఆదివాసీ అభ్యర్థులతోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ఉద్దేశించిన జి.ఓ నెంబర్ 3 ను సుప్రీంకోర్టు గతంలో రద్దు చేసింది. షెడ్యూల్డు ప్రాంత ఇతర ఉద్యోగ పోస్టులను భర్తీజేసే ప్రక్రియకు కూడా తెరపడింది. రెగ్యులర్ పోస్టులలో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీలోనూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయకపోవడం వల్ల ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. జనరల్ డిఎస్సీతో పాటు 1998, 2008 డిఎస్సీ సందర్భంగా ... సుమారు 680 పోస్టులను పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మినిమం టైమ్‌స్కేల్ ప్రాతిపదికన...స్థానికేతరులతో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయడం వల్ల ఆదివాసీలు ఉద్యోగం పొందుతామనే ఆశ, నమ్మకం కోల్పోతున్నారు.**

రాష్ట్ర ప్రభుత్వం 6100 టీచర్ పోస్టులు భర్తీకి డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు-226, ఎస్.జి.టి-280, పి.డి-13 మరియు గిరిజన గురుకులంలో పి.జి.టి-58, టి.జి.టి-446 పోస్టులను ఖాళీగా ఉన్నట్లు జనరల్ డిఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ఏరియా, నాన్ షెడ్యూల్డ్ ఏరియాలోనూ గిరిజన సంక్షేమ శాఖ విస్తరించి వుండటం వల్ల 5వ షెడ్యూల్ ఏరియాలో 500 పోస్టులు, నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో 300 పోస్టులను కేటాయించింది.

జిల్లాల వారీగా ఖాళీలు - డిఎస్సీలో కేటాయింపు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 5 జిల్లాల పరిధిలో 5వ షెడ్యూల్డ్ ఏరియా విస్తరించి వుంది. 5వ షెడ్యూల్డ్ ఏరియానే ఒక యూనిట్‌గా తీసుకొని ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు భర్తీ చేస్తారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డిఎస్సీలో విశాఖ (పాడేరు) ఏజెన్సీ ప్రాంతంలో 175 పోస్టులకు గాను ఎస్టీలకు 7 పోస్టులు, తూర్పు గోదావరి (రంపచోడవరం, చింతూరు) ఏజెన్సీకి 205 పోస్టులకు గాను 10 పోస్టులు ఎస్టీలకు, శ్రీకాకుళం (సీతంపేట) ఏజెన్సీ ప్రాంతాల్లో 35 పోస్టులకు గాను 6 మాత్రమే ఎస్టీలకు, పశ్చిమ గోదావరి (కెఆర్‌పురం) ఐటిడిఏ పరిధిలో 70 పోస్టులకు గాను 8 పోస్టులు మాత్రమే ఆదివాసీలకు కేటాయించారు. ఏజెన్సీ ప్రాంతానికి 500 టీచర్ పోస్టులు భర్తీ చేస్తామంటూ చివరికి ఆదివాసీ నిరుద్యోగులకు కేవలం 38 పోస్టులు కేటాయించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీ నిరుద్యోగుల ముందే షెడ్యూల్డ్ ప్రాంత యేతరులకు ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడాన్ని ఆదివాసీ సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని పున: పరిశీలన చేయాలి.

పి.అప్పలనర్స

గురుకులం నిబంధనలు తుంగలో తొక్కిన సర్కారు

1998 జూన్ 3న ఉమ్మడి గురుకులం సొసైటీ నుండి విభజించి ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకులం విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. నాటి నుండి నేటి వరకు సొసైటీ (బై లా) నిబంధనల ప్రకారం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం జనరల్ డిఎస్సీలో గురుకులం పోస్టులను విలీనంచేసి గిరిజన గురుకులానికి ఉన్న స్వయం ప్రతిపత్తిని తుంగలోకి తొక్కింది. కనీసం సొసైటీ పాలక మండలిని లెక్కచేయకుండా ఏకపక్షంగా ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేయడం దారుణం. గిరిజన గురుకులంలో జోనల్ వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తారు. కానీ జనరల్ డిఎస్సీ మాత్రం జిల్లా యూనిట్‌గా నోటిఫికేషన్ భర్తీ చేయడం గురుకుల సొసైటీ నిబంధనలకు విరుద్ధం. గత 20 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నా వారిని రెగ్యులర్ చేయకుండా జనరల్ డిఎస్సీ ద్వారా స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులైన ఆదివాసీలను గిరిజన గురుకులం విద్యా సంస్థ నుండి గెంటివేతకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుట్ర ఇది. ప్రభుత్వం చర్య వల్ల ఇప్పటి వరకు ఉపాధి పొందుతున్న గిరిజన గురుకులంలో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు 504 మంది, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సిఆర్‌టి విధులు నిర్వహిస్తున్న 521 మంది ఉద్యోగం కోల్పోయి వారి స్థానంలో గిరిజనేతరులతో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయడం దారుణం.

జి.ఓ 3 రద్దుతో ఇక్కట్లు

షెడ్యూల్డ్ ప్రాంత స్థానిక ఆదివాసీ అభ్యర్థులతోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ఉద్దేశించిన జి.ఓ నెంబర్ 3 ను సుప్రీంకోర్టు గతంలో రద్దు చేసింది. షెడ్యూల్డు ప్రాంత ఇతర ఉద్యోగ పోస్టులను భర్తీజేసే ప్రక్రియకు కూడా తెరపడింది. రెగ్యులర్ పోస్టులలో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీలోనూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయకపోవడం వల్ల ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. జనరల్ డిఎస్సీతో పాటు 1998, 2008 డిఎస్సీ సందర్భంగా...సుమారు 680 పోస్టులను పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మినిమం టైమ్‌స్కేల్ ప్రాతిపదికన...స్థానికేతరులతో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయడం వల్ల ఆదివాసీలు ఉద్యోగం పొందుతామనే ఆశ, నమ్మకం కోల్పోతున్నారు.

ఐదవ షెడ్యూల్ నిబంధనలు అతిక్రమణ

భారత రాజ్యాంగం పార్ట్-10 మరియు 5వ షెడ్యూల్ ఆదివాసీలకు ప్రత్యేక హోదాను భారత పార్లమెంట్ గుర్తించింది. ముఖ్యంగా ఆదివాసీ సంస్కృతి, భాష, ఆర్థిక, సామాజిక రక్షణతో పాటు ఆదివాసులకు భద్రత, రక్షణ, పరిపాలన బాధ్యత గూర్చి స్పష్టంగా పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఏ ఉత్తర్వులైనా 5వ షెడ్యూల్ క్లాజ్ (1) (2) ప్రకారం గవర్నర్, టి.ఎ.సి అనుమతి తప్పకుండా తీసుకోవాలి. కానీ జనరల్ డిఎస్సీ నోటిఫికేషన్ జారీపై ఇటువంటి ప్రక్రియను ధిక్కరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆదివాసులకు ప్రత్యేక భాష, సంస్కృతి ఉంది. గిరిజన భాష రాని ఉపాధ్యాయులను ఏజెన్సీలో నియమించడమంటే ఆర్టికల్ 29, 32ను ఉల్లంఘించడమే.

నూతన రెగ్యులేషన్ ముసాయిదాను ఆమోదించాలి

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పున: సమీక్ష చేయాలని కోరుతూ 2020 లోనే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఆదివాసీ గిరిజన సంఘం మొదలగు సంఘాలు, వ్యక్తులు మొత్తం 17 రివ్యూ పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆదివాసీలకు అనుకూల ఉత్తర్వులు కోర్టు నుంచి వెలువడ లేదు. మరోపక్క ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు జీఓ నెంబర్ నెంబర్ 3లో గల మౌలిక హక్కులు ఉద్యోగ రిజర్వేషన్ కొనసాగించే విధంగా 5వ షెడ్యూల్డ్ క్లాజ్ (2) ప్రకారం రూపొందించిన నూతన రెగ్యులేషన్ ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి (టిఏసి) 2021 లోనే ఆమోదించింది. అలాగే 371(డి) కింద రాష్ట్రపతి ఉత్తర్వుల కోసం మరో సవరణ ముసాయిదా రూపొందించింది. కానీ టి.ఎ.సి ఆమోదాన్ని కూడా జగన్ ప్రభుత్వం కనీసం గౌరవించలేదు. మరోపక్క జనరల్ డిఎస్సీ నోటిఫికేషన్‌తో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అభద్రతా భావం, ఆందోళన కలిగిస్తోంది.

జి.ఓ నెంబర్ 3 రద్దు చేసిన తర్వాత అనేకమార్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించింది. కానీ ఏనాడూ ఆదివాసులకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్‌కు చట్టబద్ధత గురించి ప్రస్తావన లేదు. పునరుద్ధరణకు కనీసం ఎటువంటి చర్యలకూ ఉపక్రమించకుండా ఆదివాసీ యువతకు తీవ్రమైన ద్రోహానికి తలపెట్టింది. ఆదివాసీ పక్షపాతి ప్రభుత్వమంటూ ఆర్భాట ప్రచారమే తప్ప వాస్తవంలో అలాంటిదేమీ లేదు.

ఆదివాసీలకు అన్యాయం

1/70 చట్టం ప్రకారం ఏజెన్సీలో స్థిర నివాసానికి అర్హతలేని వారికి ఉద్యోగం ఇస్తే ఆదివాసీ భూముల దురాక్రమణ మరింత ఎక్కువ అవుతుంది. 2 శాతం మాత్రమే ఉన్న గిరిజనేతరులకు 95 శాతం పోస్టులు భర్తీ చేయడం, 98 శాతం మంది వున్న ఆదివాసులకు కేవలం 5 శాతం పోస్టులు మాత్రమే కేటాయించడమేనా సామాజిక సాధికారత?

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జనరల్ డిఎస్సీ నోటిఫికేషన్‌ను పున:పరిశీలించి ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు భద్రత, భరోసా కల్పించి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలి. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీ అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పన, నియామకాలపై తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. తక్షణమే జనరల్ డిఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఖాళీలలో 5వ షెడ్యూల్డ్ ఏరియా నిరుద్యోగులకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి (ప్రత్యేక ఆదివాసీ డిఎస్సీ) ఆర్డినెన్స్ జారీచేయాలి. సుప్రీంకోర్టులో విచారణ దశలో పెండింగ్ వున్న రివ్యూ పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వం ప్రధాన బాధ్యత స్వీకరించి న్యాయం చేయాలి. లేదా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని నూరు శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించడానికి రాష్ట్రపతి ప్రత్యేక ఉత్తర్వులను జారీచేయాలి. ఆదివాసీల నూరు శాతం రిజర్వేషన్ చట్టబద్ధతను న్యాయ సమీక్షకు అతీతంగా షెడ్యూల్ 9లో చేర్చాలి. షెడ్యూల్డు ప్రాంతాల్లో నూరు శాతం స్థానిక ఆదివాసీ అభ్యర్థులకే ప్రభుత్వ ఉద్యోగ, అవకాశాల కల్పనపై జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలి.

/ వ్యాసకర్త 'ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్' జాతీయ కార్యవర్గ సభ్యులు, సెల్ : 9490300917 /

సందర్భం

శాస్త్రీయ ఆలోచనతోనే సమస్యల పరిష్కారం

పరిణామక్రమంలో మానవ జీవితానికి, సైన్సుకు విడదీయరాని బంధం వుంది. మానవ వికాసం సైన్సు భూమికగానే సాధ్యమైంది. ఇదంతా పరిశీలన, స్వీయ రక్షణ, అనుభవాల సమ్మిళితంగా కొనసాగింది. అంటే మానవుల ప్రతి సమస్యకూ పరిష్కారం దొరికింది శాస్త్రీయ ఆలోచన నుంచే. అందుకే శాస్త్రీయ దృక్పథానికి అంత ప్రాముఖ్యత.

స్వతంత్రం వచ్చాక మన రాజ్యాంగంలో శాస్త్రీయ దృక్పథానికి 51 అధికరణాన్ని పొందుపరుచుకున్నాము. ప్రతి పౌరుడు శాస్త్రీయ ఆలోచనను కలిగి శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయాలని పేర్కొంది. శాస్త్రీయ దృక్పథం అనే పదాన్ని మొదట అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వాడారు. ప్రజలు తమ దైనందిన జీవితాల్లో విజ్ఞాన శాస్త్రీయ పద్ధతులను అనుసరించి నిర్ణయాలు తీసుకోవడమే శాస్త్రీయ దృక్పథం అన్నారు.

జాతీయ సైన్సు దినోత్సవాలు - నేపథ్యం

అందుకే ప్రతి ఏటా విజ్ఞాన సాంకేతికతల ప్రచారానికి, శాస్త్రీయ దృక్పథం ప్రచారానికి ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు డే ను దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాము. శాస్త్రీయ దృక్పథం ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని మేధావులు, సైన్సు కార్యకర్తల కృషితో భారత దేశంలో ప్రజా సైన్సు ఉద్యమాలు, సంస్థలు ఆవిర్భవించాయి. కేరళ శాస్త్ర సాహిత్య పరిషత్, తమిళనాడు సైన్సు ఫోరమ్, పాండిచ్చేరి సైన్సు ఫోరమ్, భారత జ్ఞాన విజ్ఞాన సమితి మొదలగువాటిని ఉదాహరణగా చెప్పవచ్చు. భారత దేశంలోని భావ సారూప్య సైన్సు ప్రచార సంస్థలతో 'అఖిల భారత ప్రజా సైన్స్ నెట్‌వర్క్' (ఎ.ఐ.పి.ఎస్.ఎన్) ఏర్పాటైంది. జన విజ్ఞాన వేదిక కూడా దీనికి అనుబంధం అయింది. ప్రజల రోజువారీ జీవితంలో ఉపయోగించే సైన్స్ ప్రాముఖ్యత గురించి సందేశాన్ని వ్యాప్తి చేయడానికి ప్రతీ సంవత్సరం జాతీయ సైన్సు దినోత్సవానికి ఒక థీమ్‌ను ప్రకటిస్తారు. ఈ ఏడాది థీమ్ 'సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్'. ఈ థీమ్ ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో, అందరికీ మరింత స్థిరమైన భవిష్యత్తును సృష్టించడంలో సైన్స్, టెక్నాలజీ కీలక పాత్రను నొక్కి చెబుతుంది.

భారత దేశ పరిస్థితి

నేటి పాలకుల కారణంగా సూడో సైన్స్ ప్రచారం పెరిగింది. అభూత కల్పనలు, మూఢాచారాలు ప్రచారమౌతున్నాయి. వాటిని ఖండించాల్సిన ప్రభుత్వాలు ఖండించక పోగా, రాజ్యాంగబద్ధంగా శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేసే వారిని అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ ప్రభుత్వాల ప్రలోభాలకు లొంగి ఉన్నత విద్యావేత్తలు సూడో సైన్సు ప్రచారానికి పాల్పడుతున్నారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఉప కులపతి సత్యనారాయణ కౌరవుల పుట్టుకనాడే టెస్ట్ ట్యూబ్ టెక్నాలజీ వుందనడం, వర్షాలు కురిసేందుకు వరుణ యాగం చేయించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నాలజీ పూనుకోవడం, గోవు పరిశోధనకు నిధులు కేటాయించడం ఉదాహరణలుగా చెప్పొచ్చు.

ఈ పరిస్థితుల్లో జాతీయ ప్రజా సైన్సు ఉద్యమ నెట్‌వర్క్ ఏ.ఐ.పి.ఎస్.ఎన్ అక్టోబర్ 2023లో మేధో మధనం జరిపి జాతీయ శాస్త్రీయ దృక్పథం ప్రచారానికి కార్యాచరణ (2023 నవంబర్ 7 నుండి 2024 ఫిబ్రవరి 28 వరకు) రూపొందించింది. తన అనుబంధ సంస్థలున్న రాష్ట్రాలలోని అన్ని విద్యా సంస్థలు, సైన్సు సంస్థల్లో సభలు, సెమినార్లు, ప్రజా శాస్త్రవేత్తల జయంతులు, వర్ధంతులు, సైన్సు ప్రాధాన్యతల రోజులు నిర్వహించాలని 'నేషనల్ క్యాంపెయిన్ ఫర్ సైంటిఫిక్ టెంపర్'కు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగానే అన్ని రాష్ట్రాల ప్రజా సైన్సు ఉద్యమ సంస్థలు కళా జాతాను నిర్వహించాయి. ఈ జాతీయ కళా జాతా ముగింపు కార్యక్రమం చివరి రోజైన ఫిబ్రవరి 28న కలకత్తా, మౌలాలి స్టేట్ యూత్ సెంటర్‌లో జరుగుతుంది. అక్కడే నేషనల్ సైంటిఫిక్ టెంపర్ మీద ఒక డిక్లరేషన్‌ను కూడా ప్రకటిస్తుంది.

- కె.వి.వి.సత్యనారాయణ,
జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు,
సెల్ : 8500004953

చెరకు ధర : స్వామినాథన్ సిఫార్సుల మాటేమిటి?

సమస్య

> **స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఆయన సూచించిన పద్ధతి ప్రకారం మద్దతు ధరలను నిర్ణయిం చేందుకు మొరాయిస్తున్నది. ఉదాహరణకు చెరకు సంగతే చూద్దాం. 2023లో కేంద్రం ప్రకటించిన ఎఫ్‌ఆర్‌పి రూ.315 (దానికి తాజాగా వచ్చే ఏడాదికి మరో 25 పెంచింది), వివిధ రాష్ట్రాలలో ప్రకటించిన సలహా ధరలు, స్వామినాథన్ పద్ధతిలో ఉండాల్సిన ధర, ఒక క్వింటాలుకు (రూ.315 ఎఫ్‌ఆర్‌పి ప్రకారం) రైతులు నష్టపోతున్నారని ఆలిండియా కిసాన్ సభ పేర్కొంటోంది.**

కేంద్ర ప్రభుత్వం తాజాగా క్వింటాలు చెరకు ధరను రూ.25 పెంచింది. దీంతో 2024-25 సీజన్‌కు రూ.340కి చేరిందని, రైతులకిచ్చిన ఈ బహుమతితో పండగ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. మన దేశంలో సీజన్ అంటే ఆర్థిక సంవత్సరానికి చెప్పే నిర్వచనం వేరు, పంటలకు వేరు. ఏప్రిల్ నుంచి మార్చి నెల వరకు ఆర్థిక సంవత్సరం. అదే పత్తి, చెరకు సంవత్సరాలు అక్టోబరు నుంచి సెప్టెంబరు వరకు లెక్కిస్తారు. దీని ప్రకారం 2024-25 సీజన్ అంటే ఈ ఏడాది అక్టోబరు నుంచి వచ్చే ఏడాది సెప్టెంబరు వరకు. కనుక ప్రకటించిన పెంపుదల వర్తమాన సంవత్సరానికి కాదు. ఈ ఏడాది ధరను సీజనుకు ముందుగా గతేడాది జూన్‌లోనే ప్రకటించారు. త్వరలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న పూర్వరంగంలో నాటకీయ పద్ధతిలో కేంద్ర మంత్రివర్గం ఫిబ్రవరి 21 సమావేశం, దానిలో చెరకు ధర పెంపు నిర్ణయాన్ని నరేంద్ర మోడీ వెల్లడించారు.

న్యాయమైన, గిట్టుబాటు ధర (ఎంఆర్‌పి) పేరుతో చేస్తున్న జిమ్మిక్కుతో రైతులకు ఒరిగేదేమిటి? షరతులు వర్తిస్తాయి అన్నట్లుగా క్వింటాలుకు 10.25 శాతం పంచదార దిగుబడి వస్తేనే ఈ ధర దక్కుతుంది. ప్రస్తుత సీజన్‌లో 2023-24కు రూ.315గా 2023 జూన్‌లో కేంద్రం ప్రకటించింది. వచ్చే ఏడాది నిర్ణీత ప్రామాణిక శాతానికి మించి ఎక్కడైనా పంచదార దిగుబడి పెరిగితే 0.1 శాతానికి రూ.3.32 అదనంగా చెల్లిస్తారు. అదే మాదిరి తగ్గితే తగ్గుతుంది. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత 2014-15 నుంచి ఈ మాదిరి పెరుగుదల లేదని కేంద్ర ప్రభుత్వం చెప్పుకున్నది నిజమే. పదేళ్ల వివరాలను చూసినపుడు చెరకు ధరను రూ.220 నుంచి రూ.315కు పెంచారు. అంటే పదేళ్లలో పెరిగింది కేవలం రూ.95 మాత్రమే. ఏడాదికి సగటు పెంపు రూ.9.50 మాత్రమే. అలాంటిది ఏకంగా రూ.25 పెంచారంటే ఎన్నికల కోసమే అంటే తప్పేముంది. పశ్చిమ ఉత్తరప్రదేశ్ రైతాంగంలో పలుకుబడి కలిగిన ఆర్‌ఎల్‌డి పార్టీ బిజెపితో చేతులు కలిపింది, చెరకు పండేది కూడా అక్కడే ఎక్కువ. ఆర్‌ఎల్‌డి మద్దతుదార్లు ఈ రాజకీయ అవకాశవాదాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని, నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారని వార్తలు వచ్చిన పూర్వ రంగంలో వారిని మచ్చిక చేసుకొనేందుకు మోడీ పూనుకున్నారు.



ఎం. కోటేశ్వరరావు

దేశంలో చెరకు ధరకు రెండు పద్ధతులను అనుసరిస్తున్నారు. ఒకటి కేంద్రం ప్రకటించే ఎఫ్‌ఆర్‌పి కాగా రెండవది కొన్ని రాష్ట్రాలు ప్రకటి స్తున్న రాష్ట్ర సలహా ధర (ఎస్‌ఏపి) సహజంగా కేంద్రం కంటే ఎక్కువగా ఉంటుంది. ఉదాహ రణకు పంజాబ్‌లో రూ.391, ఉత్తర ప్రదేశ్‌లో రూ.370 ఉంది. అందువలన కేంద్రం ప్రకటించిన ధరతో ఎవరికి ప్రయోజనం? ప్రస్తుతం ఉన్న రూ.315 ధర పంచదార దిగుబడి 9.5 శాతం అన్న అంచనాతో నిర్ణయించారు. అందువలన దిగుబడి పెరిగితేనే రైతుకు ఉపయోగం లేకపోతే నష్టమే. దిగుబడి రైతు చేతిలో ఉండదు. ప్రైవేటు రంగంలో ఉన్న ఏ ఒక్క పంచదార ఫ్యాక్టరీ దిగుబడి గురించి వాస్తవ సమాచారాన్ని వెల్లడించదు.

అందువలన దిగుబడితో నిమిత్తం లేకుండా ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్రమైనా, రాష్ట్రాలు ప్రకటించే ధరలైనా వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకోవటం లేదని, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో సాగు ఖర్చు టన్నుకు రూ.440 అవుతుందని రైతులు చెబుతున్నారు. అందుకే పెంపుదలను ముష్టి విదిల్చినట్లుగా భావిస్తున్నారు. మిల్లు యజమానులు పంచదార, తదితర ఉత్పత్తులను అమ్మిన తరువాతే రైతులకు డబ్బు చెల్లిస్తున్నారు. అంటే రైతుల పెట్టుబడితో మిల్లులు నడుస్తున్నాయి. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలకు అనుగుణంగా కేంద్రం లేదా రాష్ట్రాలు చెరకు ధర పెంచటం లేదు. ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ పాలన 2012 నుంచి 2017 వరకు 26 శాతం చెరకు ధర పెంచితే నరేంద్ర మోడీ 'అచ్చే దిన్', యోగి 'బుల్డోజర్ పాలన' ఏడు సంవత్సరాల్లో పెంచింది 17.46 శాతమే.

స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఆయన సూచించిన పద్ధతి ప్రకారం మద్దతు ధరలను నిర్ణయిం చేందుకు మొరాయిస్తున్నది. ఉదాహరణకు చెరకు సంగతే చూద్దాం. 2023లో కేంద్రం ప్రకటించిన ఎఫ్‌ఆర్‌పి రూ.315 (దానికి తాజాగా వచ్చే ఏడాదికి మరో 25 పెంచింది), వివిధ రాష్ట్రాలలో ప్రకటించిన సలహా ధరలు, స్వామినాథన్ పద్ధతిలో ఉండాల్సిన ధర, ఒక క్వింటాలుకు (రూ.315 ఎఫ్‌ఆర్‌పి ప్రకారం) రైతులు నష్టపోతున్నారని ఆలిండియా కిసాన్ సభ పేర్కొంటోంది.

ఈ పూర్వరంగంలో క్వింటాలుకు రూ.500 ధర నిర్ణయించాలని అఖిల భారత కిసాన్ సభ డిమాండ్ చేసింది. సహకార, ప్రభుత్వ రంగంలో ఉన్న పంచదార మిల్లులను జాతీయం చేయరాదని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని కూడా కోరింది. వర్తమాన సంవత్సరంలో రూ.315 అంటే దిగుబడిలో 10.25 శాతం దాటిన తరువాత పెరిగే ప్రతి 0.1 శాతానికి అదనంగా రూ.3.07 చెల్లిస్తారు, తగ్గితే ఆ మేరకు కోత పెడతారు. సగటు దిగుబడి 9.5 శాతమే ఉన్నందున క్వింటాలు ధర రూ.315గా చెప్పినా రైతుకు దక్కేది రూ.292 మాత్రమే. చెరకు ఉత్పత్తి ఖర్చుకు వంద శాతానికి మించి గిట్టుబాటు ధర చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం నమ్మబలుకుతోంది. అసలు కిటుకు అక్కడే ఉంది. క్వింటాలుకు సాగు ఖర్చును కేవలం రూ.157 మాత్రమే 2023-24 సంవత్సరానికి లెక్కగట్టి రూ.315 ప్రకటించామంటే రెట్టింపే కదా అని చెబుతున్నారు.

రైతులు మరీ అంత అమాయకంగా కనిపిస్తున్నారా? ప్రభుత్వం చెబుతున్నది వ్యవసాయ పంటల ధరల నిర్ణాయక సంస్థ సూచించిన మొత్తం. అది వాస్తవ సాగు ఖర్చును పరిగణనలోకి తీసుకోవటం లేదని ప్రారంభం నుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. అందుకే స్వామినాథన్ కమిషన్ పద్ధతి ప్రకారం సాగు ఖర్చును, మద్దతు ధరలను నిర్ణయించాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఏడాది పాటు చేసిన ఉద్యమం, తాజాగా జరుగుతున్న ఆందోళనకు నాయకత్వం వహిస్తున్నవారు కూడా కోరుతున్నది అదే.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

రాజ్యసభ ఎన్నికల్లో భారీగా బేరసారాలు

- హిమాచల్, యుపిలో బిజెపి మార్కు అక్రమాలు
- అదనపు సీట్ల కోసం అడ్డదారులు
- క్రాస్‌ఓటింగ్‌తో హిమాచల్‌లో కాంగ్రెస్‌కు ఓటమి
- కర్ణాటకలో బిజెపికి ఇద్దరు ఎమ్మెల్యేల ఝలక్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులోపల, వెలుపల ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి చివరికి రాజ్యసభ ఎన్నికలను కూడా ప్రహసనంగా మార్చేసింది. మూడు రాష్ట్రాల్లోని 15 రాజ్యసభ స్థానాలకు మంగళవారం జరిగిన ఎన్నికల్లో బిజెపి ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, బెదిరించి లొంగదీసుకోవడం, సిఆర్‌పిఎఫ్ కాన్వాయ్‌తో ఎమ్మెల్యేలను కిడ్నాపు చేయడం వంటి నీతిబాహ్యమైన పద్ధతుల్లో హిమాచల్, యుపిలో కొన్ని సీట్లు అదనంగా తన ఖాతాలో వేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లో పది, కర్ణాటకలో నాలుగు, హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక స్థానానికి ఎన్నికలు నిర్వహించగా, బిజెపి -10, కాంగ్రెస్-4, సమాజ్‌వాది పార్టీ -2 స్థానాలు గెలుచుకున్నాయి. కర్ణాటకలో బిజెపి పప్పులుడకలేదు. అక్కడ ఇద్దరు ఎమ్మెల్యేలు బిజెపికి ఝలక్ ఇచ్చారు. ఒకరు కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ మాకెన్‌కు మద్దతుగా ఓటు చేయగా, మరొకరు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. దీంతో ఈ రాష్ట్రంలోని నాలుగు స్థానాలకుగాను మూడింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. బిజెపికి ఒక్క స్థానమే దక్కింది. మూడో స్థానాన్ని కాంగ్రెస్ గెలవకుండా చేయాలని బిజెపి, జెడిఎస్ పన్నిన కుయుక్తులు బెడిసికొట్టాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఏకైక స్థానం వాస్తవానికి కాంగ్రెస్‌కు దక్కాలి. కానీ, ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలను సిఆర్‌పిఎఫ్ సాయంతో కిడ్నాపు చేయడం ద్వారా బిజెపి ఆ సీటును లాగేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లో పది స్థానాలకు గాను బిజెపి ఎనిమిది, ఎస్‌పి రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయి.

ఈ ఏడాది ఏప్రిల్ 2 నాటికి 52 మంది సభ్యుల పదవీ విరమణ చేస్తుండడంతో ఆ ఖాళీలకు ఎన్నిక అవసరమైంది. వీటిలో 12 రాష్ట్రాల్లో 41 స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవమైంది. అందులో ఎపిలో మూడు, తెలంగాణలో మూడు స్థానాలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎనిమిదో సీటు గెలుచుకునేంత బలం బిజెపి లేకపోయినప్పటికీ, ప్రత్యర్థి ఎమ్మెల్యేలను కొందరిని కొనుగోలు చేయడం ద్వారా ఆ స్థానాన్ని చేజిక్కించుకుంది. ఏడుగురు సమాజ్ వాదీ పార్టీ ఎమ్మెల్యేలు, ఒక ఎస్‌బిఎస్‌పి ఎమ్మెల్యే, ఒక బిఎస్‌పి ఎమ్మెల్యే బిజెపికి క్రాస్ ఓటింగ్ చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో కాషాయ పార్టీ అక్రమాలకు తెరలేపిందని ఎస్‌పి అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. పెద్దల సభకు జరిగే ఎన్నికలను కాషాయ పార్టీ అక్రమాలకు పాల్పడడం అత్యంత శోచనీయమని అన్నారు.

హిమాచల్‌లో ఒక్క స్థానం బిజెపికే

హిమాచల్‌ప్రదేశ్ నుండి రాజ్యసభ స్థానానికి బిజెపి అభ్యర్థి హర్ష్ మహాజన్ గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీకి, బిజెపి అభ్యర్థి హర్ష్ మహాజన్‌లకు ఒక్కొక్కరికి 34 ఓట్లు పోలయ్యాయి. దీంతో 'టాస్' ఆధారంగా గెలుపును నిర్ణయించారు. ఈ 'డ్రా'లో బిజెపి అభ్యర్థి హర్ష్ మహాజన్‌ను గెలుపు వరించింది. అధికార కాంగ్రెస్ పార్టీకి 40 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీ ఓటమి పాలయ్యారు.. ఆరుగురు కాంగ్రెస్, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలను సిఆర్‌పిఎఫ్ ఎస్కార్ట్ సహాయంతో హర్యానాకు బిజెపి తరలించి హిమాచల్‌ప్రదేశ్ సిఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు విమర్శించారు.

సంక్షోభంలో హిమాచల్ కాంగ్రెస్ ప్రభుత్వం

హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలో పడినట్లు కనిపిస్తోంది. మంగళవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపివైపు ఫిరాయించడంతో అక్కడ బిజెపి అభ్యర్థి విజయం సాధించారు. హిమచల్ ప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం 68 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక్కడ మెజార్టీ మార్కు 35. కాంగ్రెస్‌కు 40 మంది ఎమ్మెల్యేలతో స్పష్టమైన మెజార్టీ ఉంది. అయితే ప్రస్తుతం ఆరుగురు ఫిరాయించడంతో కాంగ్రెస్ బలం 34కి పడిపోయింది. బిజెపికి 25 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఫిరాయింపుతో బిజెపి బలం 31కి చేరుకుంది.

ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుకు మెజార్టీ కోల్పోయారని, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. 'రేపు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌పై చర్చ జరిగిన తరువాత ప్రస్తుత పరిస్థితిపై దృష్టి పెడతాం. ఏదీ ఏమైనా ఈ ప్రభుత్వం మెజార్టీని కోల్పోయింది' అని మంగళవారం అసెంబ్లీలో ప్రతిపక్ష నేత జైరాం ఠాకూర్ తెలిపారు.

అదానీ చేతిలో మందుగుండు సామగ్రి, క్షిపణులు

- యుపి కాన్పూర్‌లో రూ. 3 వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభం

కాన్పూర్ : దక్షిణాసియాలో అతిపెద్ద మందుగుండు సామగ్రి, క్షిపణుల తయారీకి రెండు మెగా సౌకర్యాల సముదాయాన్ని అదానీ గ్రూప్ సోమవారం ప్రారంభించింది. అదానీ డిఫెన్స్ వై ఏరోస్పేస్ 500 ఎకరాల్లో విస్తరించి ఉన్న కాన్పూర్‌లోని ఫ్యాక్టరీలలో రూ.3,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టింది. పూర్తి స్పెక్ట్రమ్ మందుగుండు సామగ్రి తయారీ సముదాయాలలో ఒకటిగా మారనుంది. ఇది సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, పోలీసుల కోసం అధిక-నాణ్యత కలిగిన చిన్న, మధ్యస్థ, పెద్ద-స్థాయి మందుగుండు సామగ్రిని ఉత్పత్తి చేస్తుంది. ఈ సదుపాయం భారతదేశ వార్షిక అవసరాలలో 25 శాతంగా అంచనా వేయబడిన 150 మిలియన్ రౌండ్లతో ప్రారంభించి, చిన్న క్యాలిబర్ మందుగుండు సామగ్రిని విడుదల చేయడం ప్రారంభించింది. "భారతదేశంలోని ప్రయివేట్ రంగంలో మొట్టమొదటిసారిగా ఉన్న ఈ అత్యాధునిక సౌకర్యాలు దేశం యొక్క స్వావలంబన, రక్షణలో సాంకేతిక పురోగతికి గణనీయ ప్రోత్సాహాన్ని అందిస్తాయి" అని అది ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే "బాలాకోట్ వైమానిక దాడి 'ఆపరేషన్ బందర్' ఐదో వార్షికోత్సవం సందర్భంగా సౌకర్యాల ఆవిష్కరణ, భారత వైమానిక దళం చేసిన చారిత్రాత్మక ఆపరేషన్, ఇది బాహ్య బెదిరింపులపై భారతదేశం యొక్క వ్యూహాత్మక దఢత్వానికి నిదర్శనం," అని ప్రకటన పేర్కొంది. ఈ సౌకర్యాలను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండే, సెంట్రల్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్‌రాజా సుబ్రమణి జీవోసీ- ఇన్- సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ ఈ సౌకర్యాలలో ఉత్పత్తి చేయబడిన మందుగుండు సామాగ్రి, క్షిపణులు దేశ భద్రతకు దోహదపడటం గర్వించదగిన తరుణమని అన్నారు. ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సీఈఓ ఆశిష్ రాజ్‌వంశీ తదితరులు ప్రసంగించారు.

ఢిల్లీలో నాలుగు ఎంపి స్థానాలకు ఆప్ అభ్యర్థుల ప్రకటన

న్యూఢిల్లీ : ఈ ఏడాదిలో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం ఢిల్లీలోని నాలుగు స్థానాలకు ఆప్ తమ అభ్యర్థులను మంగళవారం ప్రకటించింది. పార్టీ పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం న్యూఢిల్లీ లోక్‌సభ స్థానం నుంచి సోమనాథ్ భర్తి, పశ్చిమ ఢిల్లీ నుంచి మహబాల్ మిశ్రా, తూర్పు ఢిల్లీ నుంచి కుల్దీప్ కుమార్ మోను, దక్షిణ ఢిల్లీ నుంచి సాహి రామ్ పెహెల్వాన్ పోటీ చేయనున్నారు. ఢిల్లీలో మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలకు గాను ఆప్ 4, కాంగ్రెస్ 3 సీట్లలో పోటీ చేసేందుకు ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అలాగే హర్యానాలో కురుక్షేత్ర లోక్‌సభ స్థానం నుంచి సుశీల్ గుప్తాను బరిలోకి నిలుపుతున్నట్లు ఆప్ ప్రకటించింది.

లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఖన్విల్కర్

న్యూఢిల్లీ : లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎ.ఎం. ఖన్విల్కర్‌ను మంగళవారం నియమించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఖన్విల్కర్ 2022 జులైలో సుప్రీంకోర్టు జడ్జిగా పదవీ విరమణ చేశారు. రాష్ట్రపతి భవన్ సమాచారం మేరకు లోక్‌పాల్ జ్యుడిషియల్ సభ్యులుగా హైకోర్టు మాజీ జడ్జిలు లింగప్ప నారాయణ స్వామి, సంజయ్ యాదవ్, రితు రాజ్ అవస్థిలను రాష్ట్రపతి నియమించారు. అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ నాన్-జ్యుడిషియల్ సభ్యులుగా సుశీల్ చంద్ర, పంకజ్ కుమార్, అజయ్ టిర్కీలను నియమించారు.

పేదలపై పోలీసుల బీభత్సకాండ

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు రేణిగుంట పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని అక్కడ ధర్నా చేశారు. పేదలకు న్యాయం చేయాల్సిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి ఇలా కుట్ర చేసి పేదలపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. గుడిసెలు వేసుకున్న వారందరికీ ఇంటి స్థలాలు ఇవ్వకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గుడిసెల తొలగింపు అన్యాయం : సిపిఎం

గుడిసెలను బలవంతంగా తొలగించి, అడ్డుకున్న వారిపై లాఠీఛార్జి చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని కోరారు. ఒకవైపు రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రగల్భాలు పలుకుతున్న వైసిపి ప్రభుత్వం, మరోవైపు పేదలు వేసుకుంటున్న గుడిసెలను తొలగిస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

పెరుగుతున్న విద్వేషం

- బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే 75 శాతం ఘటనలు
- ఇండియా హేట్ లేబ్ నివేదిక



ఇండియా హేట్ ల్యాబ్ నివేదిక ప్రకారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ద్వేషపూరిత ప్రసంగాలు పెరుగుతున్నాయని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో 75 శాతం ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలు చోటు చేసుకున్నాయని ఇండియా హేట్ ల్యాబ్ స్పష్టం చేసింది. 2023లో దేశంలోని మతపరమైన మైనారిటీలకు వ్యతిరేకంగా ద్వేషపూరిత ప్రసంగాలను డాక్యుమెంట్ చేసే వాషింగ్టన్ డిసి ఆధారిత గ్రూప్ ఇండియా హేట్ ల్యాబ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న 668 ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలు నమోదయ్యాయి. 2023 ప్రథమార్ధంలో 255 ఘటనలు జరిగాయి. ద్వితీయార్ధంలో ఈ సంఖ్య 62 శాతం వృద్ధి చెంది, 413కి చేరుకుంది.

బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే 75 శాతం

498 ప్రసంగాలు అంటే దాదాపు 75 శాతం సంఘటనలు బిజెపి పాలిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ఢిల్లీలో (పోలీసులు, ప్రజా శాంతిభద్రతలు కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తాయి) జరిగాయి. వాటిలో 36 శాతం అంటే 239 సంఘటనలు ముస్లింలపై ప్రత్యక్ష హింసాకాండను ప్రేరేపించేవిగా ఉన్నాయి. 420 అంటే 63 శాతం ప్రసంగాలు కుట్ర సిద్ధాంతాలు, ప్రధానంగా లవ్ జీహాద్, ల్యాండ్ జీహాద్, హలాల్ జీహాద్, జనాభా జీహాద్‌లకు సంబంధించినవిగా ఉన్నాయి. 169 ఘటనలు అంటే దాదాపు 25 శాతం ముస్లిం ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకున్నవి.

ఎన్నికల సమయంలో గరిష్ఠ స్థాయికి విద్వేష ప్రసంగాలు

రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఆగస్టు నుండి నవంబర్ మధ్య కాలంలో ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని నివేదిక పేర్కొంది. మహారాష్ట్ర (118), ఉత్తరప్రదేశ్ (104), మధ్యప్రదేశ్ (65), రాజస్థాన్ (64), హర్యానా (48), ఉత్తరాఖండ్ (41), కర్ణాటక (40), గుజరాత్ (31), ఛత్తీస్‌గఢ్ (21), బీహార్ (18) ద్వేషపూరిత ప్రసంగాలు చోటుచేసుకున్నాయి. ఈ రాష్ట్రాలు మొదటి పది స్థానాల్లో ఉన్నాయి.

విద్వేష ప్రసంగాలతో బిజెపి పాలిత రాష్ట్రాల్లో హింస...

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రమాదకరమైన ప్రసంగాల సందర్భాలు ఎక్కువగా ఉన్నాయని, హింసకు ప్రత్యక్ష పిలుపులతో కూడిన అన్ని సంఘటనలలో 78 శాతం బిజెపి పాలిత రాష్ట్రాలు, భూభాగాల్లోనే జరిగాయని నివేదిక పేర్కొంది. ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన విద్వేషపూరిత ప్రసంగాల్లో 78 శాతం బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి.

ద్వేషపూరిత ప్రసంగాల ద్వారా బిజెపియేతర రాష్ట్రాలలో ప్రవేశించడానికి బిజెపి ప్రయత్నిస్తుందని నివేదిక తెలిపింది.

సంఘ్ పరివార్ అనుబంధ సంఘాలే కారణం

విద్వేషపూరిత ప్రసంగ సంఘటనలలో 126 అంటే 32 శాతం విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి), బజరంగ్ దళ్ చేసినవే. ఎన్నికల ర్యాలీల సందర్భంలో 50 విద్వేషపూరిత ప్రసంగ కార్యక్రమాలను నిర్వహించడానికి బిజెపియే కారణమని నివేదిక పేర్కొంది. మొత్తంగా సంఘ్ అనుబంధ సంఘాలు 307 విద్వేష పూరిత ప్రసంగాల సంఘటనలకు కారణమయ్యాయి. 2023లో మొత్తం ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలలో 46 శాతం జరిగాయి. "గోరక్షా దళ్ వంటి గోవుల సంరక్షణ సంఘాలు క్రమం తప్పకుండా ద్వేషపూరిత ప్రసంగంలో పాల్గొంటున్నాయని తెలిపింది.

ఎనిమిది మంది అత్యంత విద్వేష ప్రసంగీకులు!

146 ద్వేషపూరిత ప్రసంగాలు అంటే 22 శాతం సంఘటనలకు కేవలం ఐదుగురే కారణం. బిజెపి ఎమ్మెల్యేలు టి. రాజా సింగ్, నితీష్ రాణే, అంతర్రాష్ట్రీయ హిందూ పరిషత్ (ఎహెచ్‌పి) చీఫ్ ప్రవీణ్ తొగాడియా, కాజల్ శింగల, సుదర్శన్ న్యూస్ యజమాని సురేష్ చవాన్కే, హిందూ మత పెద్దలు యతి నర్సింహానంద్, కాళీచరణ్ మహారాజ్, సాధ్వి సరస్వతి మిశ్రా చాలా ద్వేషపూరిత ప్రసంగాలు చేశారని నివేదిక పేర్కొంది.

ముస్లిం వ్యతిరేక ద్వేషాన్ని పెంచడానికి ఇజ్రాయెల్-గాజా యుద్ధాన్ని ఉపయోగించడం

"ముస్లిం వ్యతిరేక ద్వేషాన్ని పెంపొందించడానికి" ఇజ్రాయెల్-గాజా యుద్ధాన్ని ఉపయోగించినట్లు నివేదిక పేర్కొంది. 2023 అక్టోబర్ 7- డిసెంబర్ 31 మధ్య జరిగిన 193 ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలలో 41 (21 శాతం) యుద్ధాన్ని భారతీయ ముస్లింల పట్ల భయాన్ని, శత్రుత్వాన్ని పెంచడానికి ఉపయోగించారు.

ద్వేషపూరిత ప్రసంగం, హింస మధ్య అవినాభావ సంబంధం ఉందని తెలిపింది. 2023 జూలైలో హర్యానాలోని నుహ్‌లో, 2023 జూన్‌లో మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో హింస అందుకు ఉదాహరణలుగా పేర్కొంది. ప్రజల మధ్య విభజన సృష్టించి బలపడేందుకు కొత్తగా కొన్ని సంఘాలు వస్తున్నాయని, ఇప్పటికే స్థాపించి ఉన్నవి కొత్త సంఘాలకు సహకరిస్తున్నాయని తెలిపింది. మైనారిటీ ద్వేషం ఎజెండాను ముందుకు తెస్తోంది.

2 నుంచి మధ్యప్రదేశ్‌లో భారత్ జోడో యాత్ర

భోపాల్ : కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లో సాగుతున్న భారత్ జోడో న్యాయ యాత్ర మార్చి 2న మధ్యప్రదేశ్‌లో ప్రవేశించనుంది. మోరెనా జిల్లా పిప్రాయిలో రోడ్ షో ద్వారా రాష్ట్రంలోకి యాత్ర ప్రవేశిస్తుందని పిసిసి ఉపాధ్యక్షులు రాజీవ్ సింగ్ తెలిపారు. రోడ్ షోలు, బహిరంగ సభల్లో రాహుల్ పాల్గొంటారని వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో ఈ యాత్ర మార్చి 6వ తేదీతో ముగుస్తుందని, 7న గుజరాత్‌లో ప్రవేశిస్తుందని తెలిపారు. మణిపూర్ నుంచి ముంబయి వరకూ జరుగుతున్న ఈ యాత్ర జనవరి 14న ప్రారంభమైన సంగతి తెలిసిందే.

భౌతికంగా స్వాధీనతా ప్రకటన

ICICI Home Finance | **రిజిష్టర్డు ఆఫీసు:** ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్ర-కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.
కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి, కుర్ల రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400059.
బ్రాంచి ఆఫీసు: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి బిల్డింగ్, మహాత్మా గాంధీ రోడ్, చంద్రమౌళిపురం, విజయవాడ-520010.

ఏదైతే,
క్రింది సంతకందారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేసి, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
ఆ విధంగా రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ పేర్కొన్న ఆస్తిని క్రింద పేర్కొన్న తేదీలలో స్వాధీనంచేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కు చెల్లింపులుచేయుటకులోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరణ / స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తాలు (రూ)	బ్రాంచి పేరు
1.	న్యూ ఏ.జె. టెక్స్‌టైల్స్ (రుణగ్రహీత), చంద్రపాటి వెంకట చంద్ర శేఖర రావు (సహ-రుణగ్రహీత), సిహెచ్. రాజ్యలక్ష్మి సుజాత (సహ-రుణగ్రహీత), సిహెచ్.వి.చంద్రశేఖర రావు (సహ-రుణగ్రహీత), LHVJW00001279381.	41-1/4-35, ఎం వార్డు 36, ఆర్ వార్డు 10, ద్వారకా నగర్, 1వ లేన్, కృష్ణ లంక పిన్ కోడ్-520013, టి.ఎస్. నం.362/3 41-1/2-35, విజయవాడ, ఆం.ప్ర.-520017. **సరిహద్దులు: ఉత్తరం:** సీతాకుమారి ఆస్తి, **దక్షిణం:** సీతారాములు ఆస్తి, **తూర్పు:** కార్పొరేషన్ రోడ్, **పడమర:** ఎం. కోటేశ్వర రావు ఆస్తి. స్వాధీనతా తేది: 24-02-2024.	07-06-2022 Rs. 87,62,381/-	విజయవాడ - బి

పై పేర్కొనబడి రుణగ్రహీతలు/ హామీదారులు మొత్తాలను చెల్లించుటకు ఇందుమూలంగా ఈ 30 రోజుల నోటీసు ఇవ్వబడుచున్నది, లేనిచో తాకట్టుపెట్టబడిన ఆస్తులను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9 క్రింది నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 30 రోజులు ముగిసిన తరువాత విక్రయించబడుతుంది.

తేది: ఫిబ్రవరి 28, 2024
ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి,
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్
ఆప్కీ ఉమీద్ కా ఖాతా
(షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
జోనల్ ఆఫీస్: 07-01-58, కాన్కోర్స్ హౌస్, లాల్‌బంగ్లా ఎదురుగా, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ-500012.
రిజిష్టర్డు ఆఫీస్:ఉత్కర్ష్ టవర్, ఎన్‌హెచ్-31 (ఎయిర్‌పోర్ట్ రోడ్), సెహ్మల్‌పూర్, కాజీసరాయ్, హర్హువా, వారణాసి, ఆ.ప్ర-221 105.

స్థిరాస్తి కోసం స్వాధీనతా ప్రకటన

ఇందమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ (సెక్యూరిటీ) ఇంటరెస్ట్ చట్టం,2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ అధీకృత అధికారి సదరు నోటీసు తేదీ నుండి 60రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తం తిరిగిచెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు జారీచేసినారు.
రుణగ్రహీతలు మొత్తంను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ సంతకందారు సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తిని దిగువ పేర్కొన్న తేదీన స్వాధీనంలోకి తీసుకున్నారు.
ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారు **ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్** వారికి దిగువ వివరించిన బకాయి మొత్తం మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది.
సెక్యూర్డు ఆస్తుల విమోచనానికి అందుబాటులోగల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) నియమాల క్రింద రుణగ్రహీత శ్రద్ధను కోరుతున్నారు.

క్ర. సం.	బ్రాంచ్ పేరు	ఖాతా పేరు	రుణగ్రహీత/ తాకట్టుదారు పేరు	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది నాటికి బాకీపడిన మొత్తం
1	హైదరాబాద్	154214000 0006214	1) ఎం. అబ్దుల్ అజీజ్ తండ్రి అబ్దుల్ ఖాదర్ (రుణగ్రహీత) 2) అబ్దుల్ ఖాదర్ తండ్రి ఇసాక్ సాబ్ (తనఖాదారు/సహ-రుణగ్రహీత)	23/08/2023	23/02/ 2024	₹ 9,69,221/-

స్థిరాస్తి యొక్క వివరణ: గ్రామం యెమ్మిగనూర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం-యెమ్మిగనూర్, కర్నూలు-ఆం.ప్ర518360లోని సర్వే నెం.185/2/బి లోని ప్లాట్ నెం.07 కలిగియున్న ఆస్తి మొత్తం. సేల్ డీడ్ నెం.902/1999 ద్వారా 194.66చ.గ.ల విస్తీర్ణం మొత్తం. ఆస్తుల సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం.6, పడమర: లాట్ నెం.8, ఉత్తరం: వడ్డే మాధన్న గ్రె యార్డ్స్, దక్షిణం: రోడ్డు.

తేదీ: 28/02/2024
ప్రదేశం: కర్నూలు
సం/-
(అధీకృత అధికారి)
ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

గగన్‌యాన్ వ్యోమగాములు వీరే..

- ప్రధాని సమక్షంలో ఇస్రో ప్రకటన

తిరువనంతపురం : 2025లో భారత్ నిర్వహించనున్న మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ మిషన్ శిక్షణ కోసం ఎంపిక చేసిన వ్యోమగాములను మంగళవారం ఇస్రో ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం తొలిసారిగా తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయి స్పేస్ సెంటర్‌ను సందర్శించిన నేపథ్యంలో ఈ పేర్లను వెల్లడించింది. మిషన్ శిక్షణ కోసం ఎంపిక చేసిన నలుగురు వ్యోమగాములు, భారత వాయు సేన (ఐఎఎఫ్) పైలట్లు గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లాలను ప్రధానికి ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ పరిచయం చేశారు. గగన్‌యాన్ మిషన్‌కు చెందిన పరికరాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని గగన్‌యాన్ పురోగతిని సమీక్షించారు. రూ.1800 కోట్లతో అభివృద్ధి చేసిన సాంకేతిక సౌకర్యాలను దేశానికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ కూడా పాల్గొన్నారు. ఎంపిక చేసిన నలుగురు వ్యోమగాములకు ముందుగా రష్యాలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం బెంగళూరు ఇస్రో కేంద్రంలో వారు శిక్షణ పొందుతున్నారు. ఈ నలుగురిలో నుంచి తుది సిబ్బందిని ఎంపిక చేయనున్నారు. మరోవైపు 2040 నాటికి చంద్రుడిపైకి వ్యోమగాములను పంపుతామని ఇస్రో ఇప్పటికే ప్రకటించింది.

కేరళలో ఎల్‌డిఎఫ్ అభ్యర్థులు వీరే!

(మొదటి పేజీ తరువాయి)

టిఎం థామస్ ఐజాక్ (పతనాంతిట్ట), కేంద్ర కమిటీ సభ్యులు, ఆరోగ్యశాఖ మాజీ మంత్రి కెకె శైలజ టీచర్ (వడకర), విద్యాశాఖ మాజీ మంత్రి సి రవీంద్రనాథ్ (చాలకుడి), కన్నూర్ జిల్లా కార్యదర్శి ఎంవి జయరాజన్ (కన్నూర్), మాజీ ఎంపి జాయిస్ జార్జి (ఇడుక్కి), వి జాయ్ (అట్టింగల్), ఎం ముఖేష్ (కొల్లం), కెజె షైన్ టీచర్ (ఎర్నాకులం), కెఎస్ హంజా (పొన్నాని), డివైఎఫ్ఐ నాయకుడు వి వాసిఫ్ (మలప్పురం), ఎంవి బాలకృష్ణన్ మాస్టర్ (కాసర్‌గోడ్) సిపిఎం తరపున పోటీ చేస్తున్నారు.

సిపిఐ నుంచి అనీరాజా (వయనాడ్), ఎస్ పన్నియన్ రవీంద్రన్ (తిరువనంతపురం), ఎస్ సిఎ అరుణ్ కుమార్ (మావెలిక్కర), విఎస్ సునీల్‌కుమార్ (త్రిసూర్) పోటీ చేస్తారు. కేరళ కాంగ్రెస్ (మణి) నుంచి థామస్ చాజిక్కడన్ (కొట్టాయం) ఎల్‌డిఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు.

ఎల్‌డిఎఫ్‌కు ప్రధాన ప్రత్యర్థి అయిన యుడిఎఫ్ తన అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. ముస్లిం లీగ్ డిమాండ్ చేస్తున్న మూడో సీటుపై ఎటూ తేల్చుకోలేకపోతున్నాయి.

బిజెపిని అధికారంలోకి రానీయకుండా చేసేందుకు సిపిఐ(ఎం) ప్రయత్నిస్తోందని గోవిందన్ అన్నారు. బిజెపి ముందంజలో ఉందంటూ కార్పొరేట్ మీడియా ఊదరగొడుతోందని, అది నిజం కాదని ఆయన అన్నారు. కార్పొరేట్- హిందూత్వ ఎజెండాకు ప్రత్యామ్నాయంగా వామపక్ష లౌకిక శక్తులు ముందుకొస్తున్నాయని గోవిందన్ అన్నారు. .

సున్నా వడ్డీ ఫార్స్

(మొదటి పేజీ తరువాయి)

నామమాత్రంగా పెరిగింది. బ్యాంకులిచ్చిన అప్పులు ఏడాదేడాదీ పెరిగినప్పుడు ఆ మేరకు సర్కారు చేసే వడ్డీ రీయింబర్స్ నిధులు పెరగాలి. అందుకు విరుద్ధంగా తగ్గుతోంది. లబ్ధిదారుల సంఖ్య కూడా తగ్గుతోంది.

ఆరో వంతు కూడా లేదు.

బ్యాంకులిచ్చే అప్పుల్లో 70 శాతం వరకు రూ. లక్ష లోపు రుణాలుంటాయి. వాటిల్లో రైతులు సకాలంలో (ఏడాది లోపు) చెల్లిస్తున్న రుణాలు 30 శాతం లోపే ఉంటున్నాయి. బ్యాంకులు 60 లక్షలకు పైన రైతులకు రూ. లక్ష లోపు రుణాలిస్తుండగా సర్కారు ఇచ్చే సున్నా వడ్డీ పట్టుమని పది లక్షల మందికి కూడా దక్కట్లేదు. రుణాలు తీసుకున్న రైతులందరికీ రెండు సీజన్లూ కలుపుకొని సున్నా వడ్డీ సుమారు రూ.3 వేల కోట్ల వరకు ఇవ్వాలి. కానీ సర్కారు ఇచ్చేది వాటిల్లో ఆరో వంతు కూడా లేదు.

ఏ నేరాన్నైనా దర్యాప్తు చేసే అధికారం ఇడికి వుందా?

- తేల్చిచెప్పాలని సుప్రీం కోర్టును కోరిన తమిళనాడు ప్రభుత్వం

న్యూఢిల్లీ : దేశంలో ఏ నేరాన్నైనా దర్యాప్తు చేసే అధికారం కేంద్ర దర్యాప్తు సంస్థ ఇడికి వుందా? లేదా? అనేది స్పష్టం చేయాలని తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. ఇసుక మైనింగ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, అమిత్ ఆనంద్ తివారిలు జస్టిస్ బేలా త్రివేది, పంకజ్ మిథాల్‌లతో కూడిన బెంచ్ ముందు తమ వాదనలు వినిపించారు. ఇసుక తవ్వకాలపై దర్యాప్తు చేసేందుకు, ఐదుగురు జిల్లా కలెక్టర్లకు సమన్లు జారీ చేసేందుకు మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఇడికి ఎలాంటి అధికారం లేదని తెలిపారు. పైగా కలెక్టర్ల ఆధార్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఇసుక తవ్వకాల ప్రదేశాల జాబితా, జిపిఎస్ వివరాలు వంటివన్నీ వారితో పాటు తీసుకురమ్మని కోరడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇసుక తవ్వకాలనేది పిఎంఎల్ఎ కింద నమోదైన నేరాల జాబితాలో లేదని సిబల్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్‌లు దాఖలైంది తంజావూరు, దిండిగల్, తేని, తూత్తుకుడి జిల్లాల్లోనని, ఇడి మాత్రం వెల్లూరు, అరియలూరు, కరూరు, తిరుచ్చి జిల్లా కలెక్టర్లకు సమన్లు జారీ చేసిందని చెప్పారు.

ఈ నేరాలపై ఇడి దర్యాప్తు చేయడానికి మీ అధికారులు సాయపడాలని జస్టిస్ మిథాల్, సిబల్‌ను కోరారు. అదే గనుక అయితే, దేశంలో ఏ నేరాన్నైనా ఇడి దర్యాప్తు చేయవచ్చని మీరు చెప్పాలని సిబల్ కోరారు. రాష్ట్రాలకు సహకరించాల్సింది ఇడి అని ఆయన స్పష్టం చేస్తూ పిఎంఎల్ఎ సెక్షన్ 66(2)ను ఉదహరించారు. 'ఏ నేరాన్నైనా ఇడి దర్యాప్తు చేస్తూ వుంటే ఆ క్రమంలో ఏదైనా నేరం జరిగిందన్న సమాచారాన్ని కనుగొంటే వెంటనే అందుకు సంబంధించిన పత్రాలను, సమాచారాన్ని రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు పంపించాల్సి వుంటుంది. అదీ జరగాల్సిన తీరు." అని సిబల్ వాదించారు.

ఇడి తరపున వాదనలు వినిపిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు మాట్లాడుతూ, తమకు నచ్చినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ వ్యవహరించాలని తమిళనాడు ప్రభుత్వం కోరుకుంటోందని అన్నారు. నిందితుల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందన్నారు. జిల్లా కలెక్టర్లకు జారీ చేసిన సమన్ల అమల్లో గతేడాది నవంబరులో స్టే సంపాదించడానికి మద్రాసు హైకోర్టుకు వెళ్లడం ద్వారా సమాఖ్యవాదం స్ఫూర్తి, భావనకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు.

ICICI Home Finance | **కార్పొరేట్ కార్యాలయం:** ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (తూర్పు), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]
స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఏదైనా ఉంది" ప్రాతిపధికన విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/ హామీదారులు/చట్టబద్ధ వారసులు. లోను ఖాతా నం.	ఏవైనా తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు,	మొత్తం బకాయి	రిజర్వ్ ధర / బయానా మొత్తం	ఆస్తి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది మరియు సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	న్యూ ఎ జె టెక్స్‌టైల్స్ (రుణగ్రహీత), చంద్రపాటి అంజన లక్ష్మి (సహ రుణగ్రహీత) సిహెచ్.వి.చంద్ర శేఖరరావు (సహ రుణగ్రహీత) సిహెచ్ రాజ్యలక్ష్మి సుజాత (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం.: LHVJW00001279381	ఇంటి బేరింగ్ డో.నం.41-4/ 4-35, ఎన్ టి ఎస్ నం.362/3, మున్సిపల్ వార్డు నం.36, రెవెన్యూ వార్డు నం.10, బ్లాక్ నం.10, 1వ లైన్, ద్వారకానగర్, కృష్ణలంక, విజయవాడ, కృష్ణాజిల్లా, విజయవాడ-520013.	Rs. 1,06,15,067/- February 27, 2024	Rs. 90,70,560/- / Rs. 9,07,060/-	March 18, 2024 11:00 AM 03:00 PM	March 30, 2024 02:00 PM 03:00 PM

మా వేలం ఏజెన్సీ **గ్లోబ్‌టెక్** వెబ్‌సైట్ (**URL Link-https://BestAuctionDeal.com**) మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. **28 మార్చి, 2024న సా.5.00 గం.**లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.
కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ చూచుట) **ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010 లేదా 28 మార్చి, 2024న సా.04:00 గం.**లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ **ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010 లేదా 28 మార్చి, 2024న సా.05:00 గం.లలోపు** దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) **"ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడడ్-ఆక్షన్"** పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్ బ్యాంక్ నుండి విజయవాడ వద్ద చెల్లించాలి.
తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, **9920807300 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను** లేదా మా **సేల్స్ అండ్ మార్కెటింగ్ పాట్నర్ నెక్సెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్**ను దయచేసి సంప్రదించండి.
అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరాణత్మక నియమాలు మరియు షరతులు, **https://www.icicihfc.com/** దయచేసి చూడండి..

తేది: 28 ఫిబ్రవరి, 2024
ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

సైన్స్ మేధావి సివి రామన్



పిల్లలూ, ఈ రోజు మన జాతీయ సైన్స్ దినోత్సవం. ప్రముఖ శాస్త్రవేత్త సర్.సి.వి.రామన్ జయంతి కూడా.

సి.వి.రామన్ పూర్తి పేరు చంద్రశేఖర్ వెంకట్ రామన్. కాంతిపుంజంపై రామన్ విస్తృత పరిశోధన చేశారు. సముద్రం నీలిరంగుగా ఎందుకు ఉన్నది? అన్న ప్రశ్నే రామన్ ఎఫెక్ట్‌కు దారితీసింది. కాంతి పరిక్షేపణ వల్లే ఆకాశం, సముద్రం నీరు నీలం రంగులో ఉంటాయని రామన్ తేల్చి చెప్పారు. సూర్యుని కాంతి సముద్రంపై పడినప్పుడు నీటిలోని అణువులు కాంతిని పరిక్షేపణం చెందిస్తాయి. పౌన:పుణ్యం ఎక్కువగా ఉన్న కాంతి కిరణాలు తక్కువగానూ, తక్కువ పౌన:పుణ్యం ఉన్న కాంతి కిరణాలు ఎక్కువగా పరిక్షేపణ చెందుతాయి. నీలి రంగు పౌన:పుణ్యం తక్కువ కాబట్టి సముద్రంలోని నీటి అణువుల్లో ఎక్కువగా స్కాటర్ అవుతుంది. అందుకుని సముద్రం బ్లూరంగులో కనిపిస్తుంది అని నిరూపించారు. అలాగే భూమి చుట్టూ ఉన్న వాతావరణంలో వాయు అణువులు నీలి రంగుని ఎక్కువగా స్కాటర్ చేయటం వలన ఆకాశం నీలి రంగులో ఉంటుందని తెలిపారు. పగలు నక్షత్రాలు కనపడకపోవడానికి కారణం కూడా బ్లూ కలర్ ఎక్కువగా ఉండటం వల్లే అని ప్రయోగాత్మకంగా చెప్పారు.

ఘన, ద్రవ, వాయు పదార్థాల ద్వారా కాంతి ప్రసరించినప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుందని నిరూపించారు. దీనినే రామన్ ఎఫెక్ట్ అంటారు. ఈ దృగ్విషయాన్ని ఫిబ్రవరి 28, 1928లో ప్రపంచానికి వెలుగులోకి తెచ్చారు. ఈ గొప్ప ఆవిష్కరణకి గుర్తుగా ఆ రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహించాలని 1986లో భారత ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి నుంచి ఏటేటా జాతీయ సైన్స్ దినోత్సవాలను జరుపు కుంటున్నాం. అలాగే రామన్ ఎఫెక్ట్‌కు బ్రిటీష్ ప్రభుత్వం కూడా 1929లో నైట్‌హుడ్ అనే బిరుదుతో రామన్‌ను సత్కరించింది. ఈ పరిశోధనకు 1930లో నోబుల్ ప్రైజ్ కూడా వచ్చింది. భారత ప్రభుత్వం కూడా 1954లో 'భారత రత్న' ప్రకటించింది. 1957లో లెనిన్ శాంతి బహుమతిని కూడా పొందారు. సివి రామన్‌ను బ్రిటీష్ ప్రభుత్వం 'సర్' అనే బిరుదును సత్కరించింది.

రామన్ ఎఫెక్ట్‌తో ప్రయోజనాలు అనేకం

రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, భూగర్భశాస్త్రం, వైద్యశాస్త్రంలో వివిధ మూలకాల, అణువుల నిర్మాణాన్ని పరిశీలించొచ్చు. ఔషధాల తయారీలో వివిధ జీవరాశుల నిర్మాణం, సమ్మేళనాలు, నూతన ఔషధ అభివృద్ధికి ఉపయోగపడుతుంది. గాలిలో, నీటిలో, నేలలో కలుషిత కారకాలను కనుగొనటానికి ఉపకరిస్తుంది. నేర నిర్ధారణలో (క్రైం) ఉపయోగపడతాయి. ఆహార పదార్థాల కల్తీని తెలుసుకోవటానికి, ఫోర్జరీలను గుర్తించటానికి సహాయపడుతుంది. వస్త్రాల రంగుల తయారీకి, వైద్యరంగంలో మందుల విశ్లేషణ, ఆహార పదార్థాల విశ్లేషణ, కలర్ ఫొటోగ్రఫీ, ప్లాస్టిక్ ఇండస్ట్రీలో, రబ్బరు పరిశ్రమలో ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

– డాక్టర్ శాంతిశ్రీ
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు.

నేను గీసిన బొమ్మ

పి.భాగ్యలక్ష్మి,
5వ తరగతి,
ఎంపిపిస్ గంగినేనిపాలెం,
జి.కొండూరు మండలం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రబీర్ ఆరోగ్యంపై ఎయిమ్స్ వైద్యులతో పరిశీలన

సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ ఆరోగ్య పరిస్థితి ఎలా వుందో పరీక్షించి, నిర్ధారించేందుకు డైరెక్టర్ల బోర్డును నియమించాల్సిందిగా ఎయిమ్స్ డైరెక్టర్‌ను సుప్రీం కోర్టు ఆదేశించింది. యుఎపిఎ కింద తీహార్ జైల్లో ఆయన ప్రస్తుతం వున్నారు. 'ఆస్పత్రులు వున్నవి ప్రతి ఒక్కరి కోసం, అంతేకానీ డబ్బు సంచీల కోసం కాదని' ఢిల్లీ పోలీసుల తరపున వాదనలు వినిపిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు అనడంతో జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ విస్మయానికి గురైంది. అయినా వ్యక్తులకు ప్రత్యేక చికిత్సనం దించలేమని చెప్పారు. ఒక నిందితుని వైద్య చికిత్సలకయ్యే వ్యయం ప్రభుత్వం ఎందుకు భరించాలని ఆయన ప్రశ్నించారు. "ఆయన మీ ప్రత్యేక అతిథి. కస్టడీలో వున్నారు. ఇలాంటి వాదనలు లేవనెత్తకూడదు. అలాంటపుడు ఆయన్ని వెంటనే విడుదల చేయండి. మంచి ఆస్పత్రుల్లో ఆయన తనకు కావాల్సిన చికిత్స చేయించుకుంటారు." అని జస్టిస్ మెహతా, సొలిసిటర్ జనరల్ రాజుతో అన్నారు. పుర్కాయస్థ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ, సొలిసిటర్ జనరల్ ఏ సూత్రాన్ని ప్రస్తావిస్తున్నారో తెలుసుకోవాలనుకుంటున్నానని అన్నారు. 'వారు ఇబ్బందుల్లో వుంటే నేను వ్యక్తిగతంగా సాయమందిస్తా'నని సిబల్ అన్నారు.

తీహార్ వైద్య బృందం అందజేసిన నివేదిక పట్ల పుర్కాయస్థ పక్షం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఈ పరిస్థితి ఎదురైంది. ఆయనకు మెడికల్ పరీక్షలు చేయించాల్సిందిగా గత విచారణ సందర్భంగా జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. వారందించిన నివేదిక వాస్తవిక వైద్య పరిస్థితులను ప్రతిబింబించేలా లేదని, అది సరికాదని సిబల్ వ్యాఖ్యానించారు. దాంతో ఎయిమ్స్ కమిటీని వేయాల్సిందిగా కోర్టు ఆదేశించింది. రెండు వారాల తర్వాత విచారణను వాయిదా వేసింది.

ఎన్నికల నియమావళికి ముందే సిఎఎ నిబంధనలు జారీ

న్యూఢిల్లీ: పాకిస్తాన్, వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలుకు సంబంధించిన నిబంధనలను ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉనికిలోకి రాక ముందే దేశంపై రుద్దాలని బిజెపి ప్రభుత్వం చూస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటిం చిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుంది, ఈ షెడ్యూల్ మరో పది పదిహేను రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. ఈలోగానే సిఎఎ నియమాలు జారీ చేయాలని, తద్వారా దేశంలో ఇస్లామిక్ ఫోబియాను రెచ్చగొట్టాలన్నది బిజెపి యత్నం. అయితే, చట్టం అమలుకు నిబంధనలు తప్పనిసరి కావడంతో ఇప్పటి వరకు అమలు కాలేదు.సీఏఏను ముందుకు తెచ్చి ఇప్పటికే దేశంలో మతహింసకు కారణమైన బిజెపి, ఇప్పుడు ఎన్నికల్లో లబ్ధి కోసం మళ్లీ దీనిని తెరపైకి తెస్తోంది.

రైల్వేపై బిజెపి కపట ప్రేమ

- ఆధునీకరణ పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- ముగిసిన 'జన శంఖారావం' పాదయాత్ర

ముగింపు సభలో మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి – విజయవాడ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైల్వే రంగంపై కపట ప్రేమ చూపుతోందని, ఎన్నికల జిమ్మిక్కులు చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని చెబుతున్న బిజెపి ప్రభుత్వం భారతీయ రైల్వేను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఆరు రోజులపాటు సాగిన "సిపిఎం జన శంఖారావం" పాదయాత్ర మంగళవారం రాత్రితో ముగిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు బాబూరావు పాదయాత్ర నిర్వహించారు. ఈ నెల 22న ప్రారంభమైన ఈ పాదయాత్ర చివరి రోజున నగరంలోని కస్తూరిబాయిపేట, గిరిపురం, సీతారాంపురం, మైసూర్ కేఫ్, చుట్టుగుంట, మారుతినగర్ సెంటర్ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా రెడ్ సర్కిల్ సెంటర్లో బెల్లపు శోభనాద్రి విగ్రహానికి, శిఖామణి సెంటర్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రావు విగ్రహాలకు బాబూరావు పూలమాలలు వేశారు. ఆయనకు ప్రజలు అడుగడుగునా స్వాగతం పలికారు. ప్రజలు తమ సమస్యలను పాదయాత్ర దృష్టికి తీసుకొచ్చారు. "300 యూనిట్లు కరెంటు దాటితే ప్రభుత్వ పథకాలు రావడం లేదని, సెంటు స్థలం ఉన్నా పథకాలు నిలిపేస్తున్నారని, కుంటి సాకులతో పింఛన్లు ఎగ్గొట్టారని' విన్నవించుకున్నారు. పథకాలపై ప్రచారం తప్ప, అందినది అంతంత మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. బీసెంట్ రోడ్డులోని అన్సారీ పార్క్ సెంటర్‌లో జరిగిన ముగింపు సభలో బాబూరావు మాట్లాడుతూ రైల్వేలోని అన్ని విభాగాలను ప్రయివేటు వ్యక్తులకు కేంద్రం కట్టబెడుతోందన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి, రైల్వే ఫ్లైఓవర్, అండర్ బ్రిడ్జిలను కేంద్రం విస్మరించినా రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నోరుమెదపడంలేదని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోన్న బిజెపికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం చేరని కృష్ణా జలాలు!

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

'హంద్రీనీవా' కృష్ణా జలాలు కుప్పంకు పూర్తి స్థాయిలో చేరుకోకపోవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గం పరిధిలోని రామకుప్పం మండలం రాజుపేట వద్ద కృష్ణా జలాలకు హారతి ఇచ్చి సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నీటిని కుప్పం ప్రాంతం వైపు వదిలారు. ఈ కాలువ నీరు మంగళవారానికే శాంతిపురం సమీపంలో ఇంకిపోయింది. దీంతో, ప్రజల ఆశలు ఒక్క రోజులోనే ఆవిరయ్యాయి. దీంతో, హంద్రీనీవా కాలువలో జగనన్న నీలెక్కడ అంటూ రామకుప్పం మండలానికి చెందిన టిడిపి నేతలు ఆందోళనకు దిగారు. దీనిపై ఇరిగేషన్ శాఖాధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ అని వచ్చాయి. గతంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.560 కోట్ల ఖర్చుతో 672 కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణా నది జలాలను కుప్పంకు విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ కాలువ నీటిని 110 మైనర్ ఇరిగేషన్ చెరువుల ద్వారా 6,300 ఎకరాల అందిస్తామని చెప్పారు. అయితే, ఈ కాలువలో పూర్తి స్థాయిలో కృష్ణా జలాల రాలేదని, ఎన్నికల లబ్ధి కోసం ఆగమేఘాలపై దీనిని ప్రారంభించారని ఈ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు 1983 అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేశారు.

రామకుప్పం మండలం రాజుపేట వద్ద ఇంకిపోయిన హంద్రీ నీవా కాలువ జలాలు

మోసగించిన ముఖ్యమంత్రి : సిపిఎం

కుప్పం నియోజకవర్గానికి హంద్రీ–నీవా నీళ్లు తీసుకొచ్చామంటూ ఆర్భాటంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి ప్రజలను మోసగించారని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు విమర్శించారు. అసంపూర్తిగా ఉన్న కాలువను పూర్తి చేయకుండా వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం నీటిని స్టోరేజ్ చేసి తాత్కాలిక గేట్లు పెట్టి కుప్పం నియోజకవర్గానికి వదిలామని చెప్పడం మోసం తగదన్నారు.

మూడేళ్లలో కోటి పని దినాలు మాయం

- మోడీ జమానాలో ఉపాధి హామీ తీరు
- 61 శాతానికి పడిపోయిన వంద రోజుల పని పొందిన కుటుంబాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలతో మూడేళ్లలో కోటి ఉపాధి హామీ పనిదినాలు మాయమయ్యాయి. కరోనా మహమ్మారి తరువాత నుండి మూడేళ్లలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వద్ద అందుబాటులో ఉన్న డేటా ప్రకారం, గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమంలో 2020-21లో మూడు కోట్ల 89 లక్షల పని దినాల నుండి ఇప్పటివరకు రెండు కోట్ల 80 లక్షలకు తగ్గింది. అదే సమయంలో, ఏడాదిలో పూర్తి వంద రోజుల పనిని పొందిన కుటుంబాల మొత్తం సంఖ్య 61 శాతానికి పడిపోయింది. 2020-21లో 71 లక్షల 90 వేల కుటుంబాలకు వంద రోజుల పని లభించింది. 2023-24లో ఇప్పటివరకు 27 లక్షల 50 వేల కుటుంబాలే చట్టం ప్రకారం వంద రోజుల పూర్తి కోటాను ఉపయోగించుకోగలిగాయి. చేసిన పనులకు నగదు విడుదల చేయడంలో జాప్యం ప్రభావం చూపిందని నిపుణులు తెలిపారు.

ఉపాధి హామీ కార్మికునికి ఇచ్చిన సగటు రోజువారీ వేతనం రూ.219, ఇది స్త్రీ, పురుష కార్మికులకు సగటు కనీస వ్యవసాయేతర వేతనాల కంటే బాగా తక్కువగా ఉంది. 2022 అక్టోబర్ వరకూ సమాచారాన్ని విశ్లేషించగా, ఒక మహిళా కార్మికురాలు రోజుకు రూ.248, ఒక పురుష కార్మికుడు రూ.344 పొందుతున్నట్లు థింక్ ట్యాంక్ సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్‌కు చెందిన అకౌంటబిలిటీ ఇనిషియేటివ్ తెలిపింది.

ఉపాధి హామీ నిర్వీర్యానికి కుట్ర: బి.వెంకట్

కేంద్రంలోని మోడీ సర్కార్ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. ఉపాధి హామీకి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ఆధార్ ఆధారిత చెల్లింపులు, బయోమెట్రిక్, ఫేస్ అథెంటికేషన్ వంటి చర్యలు అందులో భాగమేనని చెప్పారు. ఇప్పటికే 2022-23లో 5.18 కోట్ల మంది ఉపాధి కార్మికుల పేర్లు ఉపాధి హామీ నుండి తొలగించారని విమర్శించారు.

రాందేవ్ బాబాపై సుప్రీంకోర్టు మండిపాటు

- పతంజలి తప్పుడు ప్రకటనలపై ఆగ్రహం
- కేంద్రానికీ చివాట్లు

న్యూఢిల్లీ : బడా వ్యాపారవేత్త, యోగా గురు రాందేవ్ బాబాపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించే పతంజలి వ్యాపార ప్రకటనలపై మండిపడింది. కంపెనీ ఉత్పత్తుల ప్రచారం, వాటి సామర్థ్యానికి సంబంధించిన ప్రకటనల విషయంలో కోర్టు ఇది వరకు ఇచ్చిన ఆదేశాలను ఉల్లఘించడంపై రాందేవ్ బాబాకు, పతంజలి కంపెనీ సిఇఒ బాలకృష్ణకు నోటీసులు జారీ చేసింది. ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ (ఐఎంఎ) పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై గతేడాది నవంబర్‌లో విచారణ జరిపిన న్యాయ స్థానం పతంజలిని తీవ్రంగా హెచ్చరించింది. వివిధ రకాల వ్యాధులను శాశ్వతంగా నయం చేస్తుందం టూ అసత్య, తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని ఆదేశాలు ఇచ్చింది. వాటిని ఉల్లంఘించిన పక్షంలో కోర్టు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో పతంజలి కోర్టుకు హామీ ఇచ్చింది. అయితే ఆ ఆదేశాలను మళ్లీ విస్మరించడంతో ఐఎంఎ కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. కంపెనీ ఉత్పత్తుల ప్రచారం, వాటి సామర్థ్యానికి సంబంధించిన ప్రకటనల విషయంలో కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘించడంపై న్యాయమూర్తులు హిమా కోహ్లీ, అమనుల్లాతో కూడిన ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదేశాలను ఉల్లంఘించినందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయాలంటూ రామ్‌దేవ్ బాబాకు, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ఆచార్య బాలకృష్ణకు నోటీసులు జారీ చేసింది. ఇతర వైద్య విధానాలపై ప్రభావం చూపేలా ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ఎలాంటి ప్రకటనలూ ఇవ్వొద్దని మరోసారి హెచ్చరించింది.

కేంద్రం కళ్లు మూసుకుని వ్యవహరించింది

అదే విధంగా ప్రకటనల విషయంలో చూసీచూడనట్లుగా కేంద్రం వ్యవహరించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. సంస్థపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కళ్లు మూసుకుని కేంద్రం చూస్తూ కూర్చుందంటూ మందలించింది. నిషేధించిన చర్యలను సంస్థ తీసుకుంటున్నప్పటికీ రెండేళ్లుగా కేంద్రం మౌనంగా వుండడంపై మండిపడింది.

పారిస్ ప్రతిపాదనలపై హమాస్ అధ్యయనం

- రంజాన్‌కల్లా కాల్పుల విరమణ ఒప్పందం!

గాజా : గాజాలో కాల్పుల విరమణ, బందీల మార్పిడి ఒప్పందం కోసం పారిస్‌లో చర్చల సందర్భంగా ఇజ్రాయిల్, అమెరికా, ఖతార్, ఈజిప్ట్‌లు చేసిన ప్రతిపాదనలపై హమాస్ అధ్యయనం చేస్తోంది. దీనిపై ఇంకా అధికారికంగా ఎలాంటి వ్యాఖ్యలు వెలువడలేదు. వారం రోజుల్లోగా కాల్పులకు విరమణ వుంటుందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ సూచనప్రాయంగా చెప్పారు. ఆరు వారాల పాటు కాల్పుల విరమణ జరగాలని, ఈ కాలంలో హమాస్ అదుపులో వున్న 40మంది బందీ లను విడుదల చేసేందుకు అనుమతించాలని, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న దాదాపు 400 మంది పాలస్తీనియన్లను విడుదల చేయాలన్న డిమాండ్లు ఈ ప్రతిపాదనల్లో వున్నాయి. ఖైదీల్లో మహిళలు, పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు కూడా వున్నారు. రోజుకు 8 గంటల పాటు ఇజ్రాయిల్ మిలటరీ వైమానిక నిఘాను నిలిపివేయాలన్న ప్రతిపాదన కూడా ఇందులో వుంది. అదే సమయంలో గాజాలోకి పంపే మానవతా సాయం గణనీయంగా పెరగాలని, రోజుకు 500 ట్రక్కుల సాయాన్ని అనుమతించాల్సి వుందని మీడియా వార్తలు పేర్కొంటున్నా యి. యుద్ధ భయంతో చెల్లాచెదురై ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా వెళ్లిపోయిన పాలస్తీనియన్లందరూ తిరిగి తమ నివాసాలకు వచ్చేందుకు అనుమతించాలని హమాస్ డిమాండ్ చేస్తోంది. ఖతార్ రాజధాని దోహాలో ఇజ్రాయిల్, హమాస్ ప్రతినిధి బృందాలు వేర్వేరుగా చర్చలు జరుపుతున్నాయి. మార్చి 10లోగా అంటే రంజాన్ మాసం ప్రారంభం కావడానికి ముందేకాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశాలు వున్నాయని మధ్యవర్తులు భావిస్తున్నారు.

ఇజ్రాయిల్, హమాస్ మధ్య మార్చి 4వ తేదీకల్లా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశం వుందని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. న్యూయార్క్ పర్యటన సందర్భంగా బైడెన్ మీడియాతో మాట్లాడుతూ, బందీలను విడిపించేందుకు, గాజాకు మానవతా సాయం అందేలా చూసేందుకు ఈ ఒప్పందం వెసులుబాటు కల్పిస్తుందని అన్నారు.

ఇజ్రాయిల్ సైనికుల లూటీలు

గాజాలో పౌర నివాస ప్రాంతాలపై ఇజ్రాయిల్ సైన్యం దాడులు జరుపుతూ విధ్వంసాన్ని సృష్టించడమే గాక, వారి ఇళ్లల్లో లూటీలకు కూడా పాల్పడుతోంది. ఇదేదో ఘనకార్యం సాధించినట్లుగా ఇందుకు సంబంధిం చిన వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నా రు. ఇటువంటి కొన్ని వీడియో క్లిప్‌లను దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. ఇజ్రా యిల్‌ను యుద్ధ నేరస్థ దేశంగా ప్రకటించాలని కోరింది. తన తండ్రి తనకు 15ఏళ్ల క్రితం కొనిపెట్టిన గిటార్‌ను వాయిస్తూ ఒక సైనికుడు చేసిన టిక్‌టాక్ వీడియోను చూసి నవంబరులో పాలస్తీనియన్ గాయకుడు హమదా నస్రల్లా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

రన్నరప్‌గా భారత ఫుట్‌బాల్ జట్టు

- టర్కిస్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్లో కొసావో చేతిలో ఓటమి
- ఉత్తమ మిడ్‌ఫీల్డర్‌గా మనీషా

రన్నరప్ ట్రోఫీతో భారత మహిళలజట్టు

అలన్యా(టర్కీ): టర్కిస్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీ రన్నరప్‌తో సరిపుచ్చుకుంది. మంగళవారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో భారత మహిళలజట్టు 0–1తో కొసావో జట్టు చేతిలో ఓటమిపాలయ్యింది. ఇంజురీ సమయం(90+2)లో గోల్ సమర్పించుకొని భారత్ ఓడింది. గ్రూప్ దశలో పటిష్ట ఎస్టోనియాను చిత్తుచేసినా.. ఫైనల్లో తనకంటే ర్యాంకుల్లో చిన్నదేశమైన కొసావో ఓటమి భారత బృందాన్ని నిరాశపరిచింది. కొసావో తరఫున ఏకైక గోల్‌ను ఫ్రెలెటా మెమెటి చేసింది. తొలి మ్యాచ్‌లో యూరోపియన్ జట్టు ఎస్టోనియాపై 1–0తో సంచలన విజయం సాధించిన భారత మహిళలజట్టు ఫైనల్లో ఆ ప్రతిభను కనబర్చులేకపోయింది. టోర్నమెంట్‌లో ఆడిన మూడు మ్యాచుల్లో భారత మహిళల జట్టు అత్యుత్తమ ప్రదర్శన ఎస్టోనియాను చిత్తుచేయడమే. కొసావోతో మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకొన్నా విజేతగా నిలిచేది. భారత్‌కు చెందిన మనీషా కళ్యాణ్ టోర్నమెంట్ అత్యుత్తమ మిడ్‌ఫీల్డర్‌గా ఎంపికైంది. మూడోసారి ఈ టోర్నీ బరిలోకి దిగిన భారత్ 2024 ఎడిషన్‌లో ఎస్టోనియా, హాంకాంగ్‌లపై గెలిచి కొసావో చేతిలో ఓటమిపాలైంది.

2వ స్థానంలో ఇండియా

డబ్ల్యుటిసి 2023–25 టెస్ట్ ఛాంపియన్‌షిప్

దుబాయ్: ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి 2023–25) పాయింట్ల పట్టికలో భారత్ 2వ స్థానానికి ఎగబాకింది. రాంచీ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన నాల్గో టెస్ట్‌లో భారత్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో మరో టెస్ట్‌మ్యాచ్ మిగిలి ఉండగానే టీమిండియా 3–1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. దీంతో భారత్ డబ్ల్యుటిసి పాయింట్ల పట్టికలో ర్యాంక్ మెరుగైంది. ఇక సిరీస్‌ను చేజార్చుకున్న బెన్‌స్టోక్స్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు (19.44పాయింట్లు) 8వ స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్ జట్టు దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేయడంతో అగ్రస్థానానికి చేరుకోగా, అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా మూడోస్థానానికి పడిపోయింది.

డబ్ల్యుటిసి పాయింట్ల పట్టిక

జట్టు	ఆడినవి	గెలుపు	ఓటమి	డ్రా	పాయింట్లు	గెలుపుశాతం
1. న్యూజిలాండ్	4	3	1	0	36	75.00
2. భారత్	8	5	2	1	62	64.58
3. ఆస్ట్రేలియా	10	6	3	1	66	55.00
4. బంగ్లాదేశ్	2	1	1	0	12	50.00
5. పాకిస్తాన్	5	2	3	0	22	36.66
6. వెస్టిండీస్	4	1	2	1	16	33.33
7. దక్షిణాఫ్రికా	4	1	3	0	12	25.00
8. ఇంగ్లండ్	9	3	5	1	21	19.44
9. శ్రీలంక	2	0	2	0	0	00.00

33బంతుల్లోనే సెంచరీ

టి20 రికార్డుపుటల్లో నమీబియా బ్యాటర్

దుబాయ్: మైల్‌స్టోన్ టి20 ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో నమీబియా బ్యాటర్ జాన్ నికోల్ లాఫ్టీ–ఈటన్ కేవలం 33బంతుల్లోనే సెంచరీ కొట్టి రికార్డు పుటల్లోకెట్టాడు. మంగళవారం నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈటన్ కేవలం 33బంతుల్లో 11ఫోర్లు, 8 భారీ సిక్సర్ల సాయంతో సెంచరీని పూర్తి చేశాడు. దీంతో 2023లో నేపాల్ బ్యాటర్ కుషాల్ మొల్లా(34బంతుల్లో సెంచరీ) రికార్డును బ్రేక్ చేశాడు. ఈ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా జట్టు 11 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 62పరుగులు చేసి కష్టాల్లో ఉన్న దశలో క్రీజ్‌లోకి వచ్చిన నికోల్ 36బంతుల్లో 101పరుగులు కొట్టి ఆ జట్టు భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. దీంతో నమీబియా జట్టు 20 ఓవర్లలో 206పరుగులు చేసింది. ఛేదనలో నేపాల్ జట్టు 18.5ఓవర్లలో 186పరుగులకు కుప్పకూలింది. దీంతో నమీబియా జట్టు 20 పరుగుల తేడాతో గెలిచింది.

టి20ల్లో వేగంగా సెంచరీ కొట్టిన బ్యాటర్లు..

33 : జాన్ నికోల్ లోఫ్టీ ఈటన్(నమీబియా); నేపాల్‌పై 2024
34 : కుశాల్ మల్లా(నేపాల్); మంగోలియాపై 2023
35 : డేవిడ్ మిల్లర్(దక్షిణాఫ్రికా); బంగ్లాదేశ్‌పై-2017
35 : రోహిత్ శర్మ(ఇండియా); శ్రీలంకపై-2017
35 : సుదేశ్ విక్రమశేఖర(చెక్ రిపబ్లిక్); టర్కీపై-2019

సెమీస్‌కు ముంబయి, తమిళనాడు

రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్స్

ముంబయి: రంజీ ట్రోఫీ సెమీఫైనల్లోకి ముంబయి, తమిళనాడు జట్లు ప్రవేశించాయి. ముంబయి–బరోడా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రా కాగా.. సౌరాష్ట్రను చిత్తుచేసి తమిళనాడు జట్టు సెమీస్‌కు చేరింది. క్వార్టర్స్‌లో బరోడాతో మ్యాచ్‌ను ముంబయి జట్టు డ్రా చేసుకొని తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతను సాధించింది. ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 384పరుగులు చేయగా.. బరోడా 348 పరుగులకే ఆలౌట్ అయింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ముంబయి 569 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ జట్టులో 10, 11వ బ్యాటర్స్ సెంచరీలతో రాణించి రికార్డు నెలకొల్పారు. దీంతో 605పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన బరోడా చివరిరోజు ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. డిఫెండింగ్ ఛాంపియన్ సౌరాష్ట్రను తమిళనాడు జట్టు ఇన్నింగ్స్ 33 పరుగుల తేడాతో ఓడించింది. మరో క్వార్టర్‌ఫైనల్లో విదర్భ జట్టు 127పరుగుల తేడాతో కర్ణాటకను చిత్తుచేసి సెమీస్‌కు చేరగా.. నాలుగు పరుగుల దూరంలో ఆంధ్రాజట్టు మధ్యప్రదేశ్ చేతిలో ఓటమిపాలవ్వడంతో మధ్యప్రదేశ్ సెమీస్‌కు చేరింది. మార్చి 2–6వరకు సెమీస్, 10–14న ఫైనల్ జరగనున్నాయి.

సెమీఫైనల్స్...

మధ్యప్రదేశ్ × విదర్భ, తమిళనాడు × ముంబయి

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68